KHATME NUBUVVATH
(Telugu)

దైవదౌత్యం ముగింపు

మూలం:

సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది

అనువాదం:

ఎస్.ఎమ్. మలిక్

విషయసూచిక

1. తొలిపలుకు 04

2. దైవదౌత్యం ముగింపును గురించి
ప్రవక్త మహనీయుల (స) ప్రవచనాలు 11

3. ప్రవక్త సహచరుల ఏకాభిప్రాయం 18

4. సముదాయంలోని ధర్మవేత్తలందరి ఏకాభిప్రాయం 20

5. అల్లాహ్‌కు మన విశ్వాసం పట్ల ఏదయినా శత్రుత్వమా? 30

6. ఇప్పుడు ప్రవక్త అవసరం ఏముందనీ? 32

7. కొత్త దైవదౌత్యం ఇప్పుడు ఉమ్మత్‌కు
కారుణ్యం కాదు అభిశాపం 34

8. "మసీహ్ మౌఊద్" వాస్తవికత 36

9. మర్యమ్ సుతుడు ఈసా (అ)
ఆవిర్భావం గురించి హదీసులు 37

10. ఈ హదీసుల వల్ల రుజువయ్యేదేమిటి? 47

తొలిపలుకు

ఆధునిక యుగంలో ఇస్లామ్‌కు వ్యతిరేకంగా మొదలయిన ఉపద్రవాల్లో మహా ఉపద్రవం, ఈ శతాబ్ది ప్రారంభంలో మొదలయిన 'కొత్త దైవదౌత్య ప్రకటన.' దాని సందేశం అరువయి ఏళ్ళుగా ముస్లిమ్ సముదాయంలో మార్గవిహీనత ప్రబలడానికి పెద్ద మార్గంగా రూపొందింది. ఇతర ఉపద్రవాలలా ఈ ఉపద్రవం బలంపుంజుకోవడానికి కారణం ముస్లిములు సర్వసాధారణంగా ధర్మంపట్ల అజ్ఞానంలో మ్రగ్గుతూ ఉండటం. ఈ అజ్ఞానమే లేకపోతే జనం దైవదౌత్యం ముగింపును సరిగ్గా ఆకళింపు చేసుకుని ఉన్నట్లయితే, మహనీయ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లమ్) తరువాత ఎవరయినా దైవదౌత్య ప్రకటన చేయగా అది ముస్లిమ్ సముదాయంలో వృద్ధి చెందడం ఏ విధంగానూ సాధ్యమయ్యేదికాదు.

నేడు కూడా ఆ ఉపద్రవాన్ని త్రిప్పిగొట్టగల సరయిన, ప్రభావశీలమయిన ఉపాయం ఏదయినా ఉంటే అది, దైవదౌత్యం ముగింపునకు సంబంధించిన వాస్తవికతను ప్రజల్లో ఇతోధికంగా ప్రచారం చేయడం, ధర్మంలో దాని ప్రాముఖ్యాన్ని బాగా బోధపరచడం, ఈ సందర్భంలో మనస్సుల్లో జనింపజేసే కుశంకలను సహేతకమయిన సమంజసమయిన ఆధారాలతో ఖండించడం కూడా అవసరం.

ఈ ఉద్దేశ్యంతోనే ఈ క్లుప్తమయిన పుస్తకాన్ని సంకలనం చేయడం జరిగింది. దీనిని అతి తక్కువ ధరకు అమ్మే ఏర్పాటు చేయడమూ జరిగింది. దీన్ని ప్రయోజనకరమయినదిగా భావించేవారు కేవలం దీన్ని చద వడంతో ఆగక దాన్ని సువిస్తారంగా వ్యాపింపజేసేందుకు సాధ్యమయినంత మేర పాలుపంచుకోవాలి. చదువుకున్న ప్రతి వ్యక్తి వరకు దీన్ని చేరవేయడం అవసరం. చదువుకున్నవారు దీన్ని చదవలేనివారికి చదివి వినిపించాలి. ఈ అపమార్గానికి ఇంకా ప్రభావితులవనివారు దీనివల్ల కాపాడబడతారని, ఇప్పటికే దీనికి గురయినవారు, సత్యకాముకులయినవారు సత్యం విశదమయిన తరువాత సత్యాన్ని గ్రహించగలరని ఆశిస్తున్నాము. అయితే ఒక తప్పుడు విషయాన్ని నమ్మిన తరువాత తమ హృదయకవాటాలను మూసుకున్న వారిని నయం చెయ్యడం దైవం తప్ప ఎవరి తరమూకాదు.

అబుల్ ఆలా మౌదూది

12, ఫిబ్రవరి, 1962

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడయిన అల్లాహ్ పేరుతో

దైవదౌత్యం ముగింపు

مَا كَانَ مُحَمَّدٌ أَبَا أَحَدٍ مِّن رِّجَالِكُمْ وَلَٰكِن
رَّسُولَ اللَّهِ وَخَاتَمَ النَّبِيِّينَ وَكَانَ اللَّهُ بِكُلِّ
شَيْءٍ عَلِيمًا ۔ (الاحزاب ٤٠)

జనులారా, ముహమ్మద్ మీ పురుషులలో ఎవ్వరికీ తండ్రికారు, కాని ఆయన దేవుని సందేశహరులు, ప్రవక్తలందరికీ అంతిమ మయిన వారు; అల్లాహ్ ప్రతి విషయ జ్ఞానమూ ఉన్నవాడు. (అల్ అహ్‌జాబ్:40)

ఈ ఆయత్ అహ్‌జాబ్ సూరా, అయిదవ రుకూలో వచ్చినది. ఈ రుకూలో అల్లాహ్ తిరస్కారులు, కపటుల అభ్యంతరాలకు సమాధానం ఇచ్చాడు. వారు హజ్రత్ జైనబ్ (ర)ని ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వసల్లం) నికాహ్ చేసుకోవడం పట్ల వ్యంగ్యోక్తులు, దెప్పిపాడుపులూ, అపనిందలు, అబద్ధాలు సృష్టించి తుఫాను లేవదీశారు. వారు చెప్పే దేమిటంటే, జైనబ్ ముహమ్మద్ (స) పెంపుడు కొడుకు భార్య. అలా ఆవిడ ప్రవక్తశ్రీ (స)కి కోడలు వరుస. ఇప్పుడు జైద్ తలాక్ (విడాకులు) ఇచ్చిన తరువాత ముహమ్మద్ (స) తన కోడలినే పెళ్ళి చేసుకున్నారు. దీనికి సమాధానం చెబుతూ పరమ ప్రభువు అల్లాహ్, ఆయత్ నెం. 37లో, ఆ నికాహ్ తన ఆదేశంతో జరిగిందని వక్కాణించాడు. ఇంకా తమ పెంపుడు కొడుకులు భార్యలకు విడాకులు ఇచ్చివేసిన తరువాత, ఆ మహిళలను

నికాహ్ చేసుకోవడంలో ముస్లిములకు ఎటువంటి ఇబ్బంది కలగరాదన్న ఉద్దేశంతో ఆ ఆదేశమివ్వబడిందని కూడా స్పష్టపరిచాడు. ఆ తరువాత 38, 39వ ఆయత్‌లలో, ప్రవక్తకు ఏ పనయితే చేయాలని అల్లాహ్ విధిగా నిర్ణయిస్తాడో ఆ పని చెయ్యకుండా ఆయన్ని ఏ శక్తీ అడ్డుకోజాలదని ప్రకటించాడు. అలాగే, ప్రజలకు భయపడడం ప్రవక్తలకు నప్పదని, వారు అల్లాహ్‌కు భయపడాలని వివరించాడు. ఇంకా ప్రవక్తల విషయంలో అల్లాహ్ పద్ధతి సదా ఒక్కటేనని, వారు ఎవరినీ లెక్కచెయ్యకుండా అల్లాహ్ సందేశాన్ని అందజేయాలని, ఎటువంటి జంకు, గొంకు లేకుండా ఆయన ఆదేశాలు పాటించాలని బోధించాడు. ఆ తరువాత ప్రస్తుత ఆయత్ సెలవిచ్చాడు. ఇందులో విరోధులందరి అభ్యంతరాలన్నింటినీ సమూలంగా కొట్టిపార వేయడం జరిగింది.

వారు చేసే మొదటి ఆక్షేపణ: ఆయన (స) తన కోడలిని పెళ్ళి చేసుకున్నారే, వాస్తవంగా ఆయన (స) తెచ్చిన షరీఅత్ (శాసనాంగం) లోనూ కొడుకు పెళ్ళి చేసుకున్న స్త్రీ తండ్రికి నిషిద్ధమయినదే అన్నది. దీనికి సమాధానంగా ఇలా చెప్పడం జరిగింది. "ముహమ్మద్ మీ పురుషుల్లో ఎవ్వరికీ తండ్రి కారు." అంటే ఎవరు విడాకులిచ్చిన స్త్రీని పెళ్ళి చేసుకోవడం జరిగిందో అతను అసలు కొడుకు ఎలా అయ్యాడూ, అతని విడాకులు పొందిన స్త్రీతో పెళ్ళి నిషిద్ధమవడానికి? మీకూ స్వయంగా తెలుసు, ముహమ్మద్ (స)కు అసలు కొడుకు అంటూ ఎవ్వరూ లేరన్న విషయం.

వారు చేసే రెండవ ఆక్షేపణ: సరే, పెంపుడు కొడుకు స్వంత కొడుకు కాడు అన్నప్పటికీ, అతను వదలిన స్త్రీని నికాహ్ చేసుకోవడం మహా అయితే అనుమతింపబడిన విషయం అనవచ్చు, అలా చేసుకునే అవసరం ఏముందీ? అన్నది. దానికి సమాధానంగా ఇలా చెప్పడం జరిగింది, "కాని ఆయన దేవుని సందేశహరులు." అంటే దైవసందేశహరులు అవడంచేత, ఏ హలాల్ వస్తువుల్ని, మీ ఆచారాలవల్ల మీరు అనవసరంగా హరామ్ చేసుకున్నారో వాటి విషయంలో సమస్త దురభిప్రాయాలను తొలగించడం,

అది అనుమతింపబడినదన్న విషయంలో ఎటువంటి అనుమానాలకు, ఆశంకలకు తావు లేకుండా చెయ్యడం ఆయన విధ్యుక్త ధర్మం.

ఆ పైన మరింత నొక్కి చెప్పేందుకు, "ప్రవక్తలందరికీ అంతిమ మయినవారు" అని చెప్పడం జరిగింది. అంటే ఈయన తరువాత దైవసందేశ హరుడు అలా ఉంచి, మరో ప్రవక్త కూడా రావడం లేదు. చట్టపరమయిన సంస్కరణ లేక సామాజిక సంస్కరణ ఏదయినా ఈయన కాలంలో అమలు జరిగే అవకాశం లేకపోతే వచ్చే ప్రవక్త ఈ లోపాన్ని పూరిస్తాడనడానికీ అవకాశం లేదు. అందువల్ల కూడా, అజ్ఞానకాలపు ఈ ఆచారం ఈయనే తుదముట్టించి పోవడం మరీ అవసరమయిపోయింది.

ఆ తరువాత వీటికి మరింత బలాన్ని చేకూర్చేందుకు, "అల్లాహ్ ప్రతి విషయ జ్ఞానమూ ఉన్నవాడు" అని సెలవీయడం జరిగింది. అంటే అల్లాహ్‌కు తెలుసు, ఇప్పుడే ముహమ్మద్ (స) చేత ఈ ఆచారాన్ని తుడిచిపెట్టడం ఎందుకు అవసరమయిందో, అలా చేయకపోతే ఉన్న ముప్పు ఏదో. ఆయనకు తెలుసు తన వద్ద నుండి ఇకపై మరే ప్రవక్తను పంపడం జరగదని. అందువల్ల తన అంతిమ ప్రవక్త ద్వారా ఆ ఆచారాన్ని ఇప్పుడే అంతమొందించకపోతే మరే వ్యక్తి దాన్ని భంగపరచినా సరే ప్రపంచ ముస్లిములందరిలో చిరకాలానికి గాను అది సమసిపోదు. తరువాత వచ్చే సంస్కర్తలుదాన్ని భంగపరచినా వారిలో ఎవరి ఆచరణకూడా శాశ్వత స్థాయి, విశ్వజనీన ప్రామాణికత కలిగి ఉండదు. అన్ని దేశాలవారూ, సర్వకాలాలవారూ దాన్ని పాటించరు. ఏ వ్యక్తి ఆచరణనయినా అది వారి సంప్రదాయం అయినంత మాత్రాన, ఎటువంటి ఏవగింపు భావననయినా సరే రూపుమాపగలగటానికి వారిలో ఏ ఒక్కరి వ్యక్తిత్వం కూడా ఆమేరకు పరిశుద్ధత, పవిత్రత కలిగి ఉండదు.

ఖుర్‌ఆన్ పూర్వాపరాల నిర్ణయం

ఒక వర్గం, ఈ కాలంలో కొత్త దైవదౌత్యపు మహా ఉపద్రవాన్ని సృష్టించింది. "ఖాతమన్నబీయ్యీన్" అన్న పదానికి "ప్రవక్తల ముద్ర" అని

అర్థం చెబుతుంది. దాని భావం, ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) తరువాత వచ్చే ప్రవక్తలందరు, ఆయన (స) ముద్రపడిన తరువాత ప్రవక్తలవుతారు. అంటే మరో మాటలో చెప్పాలంటే ఆయన (స) ముద్ర పడనంతవరకు వారు ప్రవక్తలు కాజాలరు అన్నమాట.

కాని ఈ పదం వచ్చిన క్రమంలో దాన్ని పరిశీలిస్తే ఈ పదానికి ఈ అర్థం గ్రహించేందుకు అవకాశమే లేదు. దీని భావం వీరు చెప్పేదే అయినట్లయితే ఈ పదం ఇక్కడ అసందర్భం మాత్రమే కాదు, వచన ఉద్దేశానికీ విరుద్ధం. లేకపోతే ఏమయినా అర్థముందా, పైనుంచి జైనబ్ (ర) నికాహ్‌ను ఆక్షేపిస్తున్న వారి ఆక్షేపణలకు, వారు సృష్టించిన కుశంకలకు, సందేహాలకు సమాధానమివ్వడం జరుగుతోంది; అకస్మాత్తుగా "ముహమ్మద్ ప్రవక్తల ముద్ర ఇకపై ఎవరు ప్రవక్త అయినా ఈయన ముద్ర పడితేనే ప్రవక్త అవుతారు" అన్న విషయం చెప్పడం జరుగుతోంది. ఈ పూర్వాపరాలలోనయితే ఈ మాట పూర్తిగా అసంబద్ధమేకాక పైనుంచి ఆక్షేపకులకు సమాధానంగా చెబుతున్న వాదన అంతా దానికి భిన్నంగా బలహీనమవుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో నయితే ఆక్షేపకులకు ఇలా చెప్పే మంచి అవకాశం దొరికేది: మీరు ఇప్పుడు ఈ పనిచేయకపోయినా ఏమీ మునిగిపోయేదికాదు. ఈ ఆచారాన్ని రూపు మాపే అవసరం అంత తీవ్రమయినదే అయినట్లయితే మీ తరువాత మీ ముద్రపడి వచ్చే ప్రవక్తల్లో ఎవరో ఒకరు దాన్ని రూపుమాపేవారు అని వారు వాదించే అవకాశముండేది. (అందువల్ల ఈ భావం అసంబద్ధమూ అర్థరహితం కూడా. అను.)

ఈ వర్గం మరో వాదన కూడా చేసింది. "خاتم النبيين" అని అంటే افضل النبيين అన్నది. అంటే దైవదౌత్య ద్వారాలయితే తెరచుకునే ఉన్నాయి, కాని దైవదౌత్య మహిమలు మటుకు ప్రవక్తశ్రీ (స)తో అంతమయ్యాయి. కాని ఈ అర్థాన్ని గ్రహించడంలోనూ మేము పైన పేర్కొన్న అపసవ్యతే అడ్డు వస్తుంది. పూర్వోత్తరా ఈ భావానికి ఎటువంటి సామరస్యత కానరాదు, ఇంకా దానికి విరుద్ధంగానే రూపొందుతుంది. తిరస్కారులు, కపటులు ఇలా చెప్పే

అవకాశ ముంది- అయ్యా, తక్కువ స్థాయివారే అయినా మీ తరువాత కూడా ప్రవక్తలు వచ్చేవారుగా, అటువంటి పరిస్థితుల్లో ఈ ఆచారాన్ని కూడా మీరే రూపుమాపి పోవలసినంత అవసరమేముందనీ?

నిఘంటువు రీత్యా 'ఖాతమన్నబీయ్యీన్' అర్థం

పూర్వాపరాల దృష్ట్యా ఇక్కడ 'ఖాతమన్నబీయ్యీన్' అన్న దాని అర్థం, ఖచ్చితంగా నబువ్వత్ (దైవదౌత్యం) పరంపరను అంతమొందించడంగానే గ్రహించడం అనివార్య మని, ప్రవక్తశ్రీ (స) తరువాత మరో ప్రవక్త ఎవ్వరూ రావడమంటూ జరగదని భావించాలి. కాని ఇది కేవలం పూర్వాపరాల దృష్ట్యానే కాదు నిఘంటువు కూడా ఇదే తప్పనిసరని సూచిస్తోంది. అరబీ నిఘంటువు, నుడికారం ప్రకారం "ఖత్మ్" అని అంటే సీలు చేయడం, ముద్రవేయడం, మూసివేయడం, కడవరకూ చేరడం, ఏదేని పనిని నెరవేర్చి ముగించడం అని అర్థం.

خَتَمَ الْعَمَلَ అని అంటే فرغ من العمل పనిచేసి ముగించాడు అని అర్థం.

خَتَمَ الْإِنَاءَ అంటే "పాత్ర మూతిని మూసి వేశాడు, దాన్ని సీలు చేశాడు. ఆ తరువాత అందులో నుంచి ఏదీ వెలికి రాకుండా మరేదీ అందులోకి చేరకుండా ఉండాలని" అని అర్థం.

خَتَمَ الْكِتَابَ అంటే "ఉత్తరం మూసివేసి దాన్ని సీలుచేసి ముద్రవేశాడు తద్వారా ఉత్తరం భద్రమయిపోవాలని" అని అర్థం.

خَتَمَ عَلَى الْقَلْبِ అంటే "హృదయంపైన ముద్రవేశాడు. ఇక ఏ మాటా అతనికి బోధపడదు, తొలి నుంచి ఉన్న మాట ఏదీ అందులో నుంచి బయటపడదు."

خِتَامُ كُلِّ مَشْرُوبٍ అంటే "ఏదయినా పానీయాన్ని సేవించిన తరువాత చివరన అనుభవంలోకి వచ్చే రుచి."

خَاتِمَةُ كُلِّ شَيْءٍ عاقبة وآخرة "ప్రతి వస్తువు అంతం అంటే ఉద్దేశం, దాని అంతిమ పరిణామం, అంతిమ పర్యవసానం."

خَتَمَ الشَّيْءَ بلغ اٰخِرَهٗ అంటే "ఏదయినా వస్తువును ముగించడమంటే దాని చివరికంటా చేరడం." ఈ అర్థంలోనే "ఖత్మె ఖుర్‌ఆన్" ఖుర్‌ఆన్ పఠనం ముగింపు అని అంటారు. ఈ అర్థంలోనే సూరాలోని చివరి ఆయత్‌లను خواتیم ఖవాతీమ్ అని అంటారు.

خاتم القومِ اٰخِرُهُمْ "ఖాతముల్ కౌమ్" అంటే ఉద్దేశం ఆ తెగకు చెందిన చివరి మనిషి అని అర్థం." (చూడండి "లిసానుల్ అరబ్", "కామూస్", "అక్రబుల్ మవారిద్")★ ఈ కారణంగానే నిఘంటుకారులంతా,

---

★ ఇక్కడ మేము కేవలం నిఘంటు గ్రంథాల్లో మూడింటిని మాత్రమే పేర్కొన్నాము. కాని మాట ఈ మూటివరకే పరిమితం కాదు. అరబీ భాషలో విశ్వసనీయమయిన ఏ నిఘంటువయినా ఎత్తి చూసుకోవచ్చు. అందులో ....అన్న పదానికి ఇదే వివరణ ఉంటుంది. కాని దైవదౌత్యం ముగింపును నిరాకరించేవారు దైవధర్మంలో పాగావేయడానికి నిఘంటువును కాదని బిరుదులు ఖితాబులను ఆధారంగా తీసుకుని ఇలా వాదిస్తారు: ఎవరినయినా کو خاتم الشعراء లేక خاتم الفقہاء లేక خاتم المفسرین (అంత్యకవి లేక అంత్య ధర్మవేత్త లేక అంత్య వ్యాఖ్యాత) అని అంటే ఈ బిరుదాంకితుడయిన వ్యక్తి తరువాత మరో కవి లేక మరో ధర్మవేత్త లేక మరో వ్యాఖ్యాత పుట్టలేదని అర్థం కాదు. దీని భావం ఆ విద్యలోని ప్రావీణ్యాలన్నీ ఆ వ్యక్తితో అంతమయ్యాయన్నది మాత్రమే. వాస్తవానికి అతిశయ ప్రయోగంగా ఇటువంటి బిరుదులు ఖితాబులు ఎన్ని ప్రయోగించినా నిఘంటువు ప్రకారం خاتم అనే పదానికి మూలార్థమే 'పరిపూర్ణత'గా, 'ఘన్యమయినది'గా మారిపోతుందని భావం కాదు, "అంతిమ" "చివరి" అనే అర్థంలో ఈ పదాన్ని ప్రయోగించడం అసలే తప్పయినదని నిర్ణయమవదు. భాషా నియమాలు తెలియని వ్యక్తి మటుకే ఇటువంటి మాట పలకగలడు. ఏ భాషలోనూ ఇటువంటి నియమం ఏదీ ఉండదు. ఒక పదాన్ని దాని అసలు అర్థంలోకాక ఎప్పుడయినా మరో అన్వయార్థంలో ప్రయోగిస్తే అదే దాని అసలు అర్థమయిపోతుందని, నిఘంటువు ప్రకారం అసలు అర్థంలో ఆ పదాన్ని ప్రయోగించడం నిషిద్ధమయిపోతుందని ఎక్కడా నియమం లేదు. మీరు ఏ అరబ్బు వ్యక్తి ఎదుటయినా جَآءَ خَاتَمُ الْقَوْم అని అంటే దానికి అర్థం, ఆ జాతి ప్రజ్ఞాశాలి, పరిపూర్ణ వ్యక్తి వస్తున్నాడని అతను గ్రహించడు. దానికి బదులు ఆ తెగ పూర్తిగా వచ్చేసిందని కడకు మిగిలి ఉన్న కడపటి వ్యక్తి కూడా వచ్చేశాడని అర్థం చేసుకుంటాడు.

వ్యాఖ్యాతలందరూ ఏకాభిప్రాయంతో "خاتم النبيين" "ఖాతమన్నబీయ్యీన్" అనే పదానికి ప్రవక్తలో చివరివారు అని అర్థం గ్రహించారు. అరబీ నిఘంటువు, నుడికారం ప్రకారం خاتم అంటే పోస్టాఫీసు ముద్ర వంటిదికాదు, దాన్నివేసి ఉత్తరాల బట్వాడా చెయ్యడానికి. నిజానికి దీని ఉద్దేశం, కవరులో నుంచి ఏదయినా బయటికి తీయకుండా బయటి నుంచి కవరులోకి ఏదయినా పంపకుండా ఉండేందుకు వేసే ముద్ర లేక సీలు అన్నమాట.

దైవదౌత్యం ముగింపును గురించి ప్రవక్త మహనీయుల (స) ప్రవచనాలు

ఖుర్ఆన్‌లో పూర్వాపరాల ప్రకారం, నిఘంటువుననుసరించి ఈ పదానికి గల అర్థాన్నే ప్రవక్త మహనీయుల వివరణలు బలపరుస్తున్నాయి. ఉదాహరణకు కొన్ని అత్యంత ప్రామాణికమయిన హదీసులు ఇక్కడ ఉటంకిస్తున్నాము.

1. ప్రవక్త మహనీయులు (స) ఇలా తెలిపారు: బనీ ఇస్రాయీల్ ప్రవక్తలు నాయకత్వమూ వహించేవారు. ఒక ప్రవక్త మరణిస్తే మరో ప్రవక్త అతని స్థానంలోకి వచ్చేవాడు. కాని నా తరువాత మరో ప్రవక్త రాడు, కేవలం ప్రతినిధులే ఉంటారు. (బుఖారి, కితాబుల్ మనాకిబ్, బనీఇస్రాయీల్ అధ్యాయం)

2. ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు: నాకూ, నాకు పూర్వం గతించిన ప్రవక్తలకు గల ఉపమానం ఏటువంటిదంటే, ఒక వ్యక్తి ఒక కట్టడాన్ని నిర్మించాడు. దాన్ని బాగా అందంగా కనులపండువుగా రూపొందించాడు. కాని ఒక మూలన ఒక ఇటుక మందం స్థలం వదలిపెట్టాడు. జనం ఆ కట్టడాన్ని చుట్టూ తిరిగి చూస్తారు, దాని చక్కదనానికి అబ్బురపడతారు. కాని అక్కడ ఇటుక ఎందుకు పెట్ట లేదూ అని అడిగేవారు. అయితే ఆ ఇటుకను నేనే. నేను "ఖాతమన్నబీయ్యీన్"ని. (అంటే నా రాకతో దైవదౌత్యపు కట్టడం

పరిపూర్ణమయింది. మరెవరైనా వచ్చి నింపడానికి ఇక చోటు ఏమీ మిగులలేదు.) (బుఖారి, కితాబుల్ మనాకిబ్, ఖాతమన్నబీయ్యీన్ అధ్యాయం)

ఇదే విషయమున్న నాలుగు హదీసులు ముస్లిమ్‌లో, కితాబుల్ ఫజాయిల్, ఖాతమన్నబీయ్యీన్‌లో ఉన్నాయి. చివరి హదీసులో ఈ పదాలు అదనంగా ఉన్నాయి. "కాగా నేను వచ్చాను, నేను వచ్చి ప్రవక్తల పరంపర అంతమొందించాను." ఇదే హదీసు, ఈ పదాలతోటే తిర్మిజిలో కితాబుల్ మనాకిబ్, నబీ ఘనత అనే అధ్యాయంలో, కితాబుల్ ఆదాబ్, ఉపమానాల అధ్యాయంలోనూ ఉంది.

ముస్నద్ అబూదావూద్, తయాలిసీలో ఈ హదీసు జాబిర్ బిన్ అబ్దుల్లా ఉల్లేఖించిన హదీసుల క్రమంలో వచ్చింది. దాని చివరి పదాలు ఇవి: ختم بي الانبياء "నా ద్వారా ప్రవక్తల పరంపర అంతమొందించ బడింది."

ముస్నద్ అహ్మద్‌లో కొన్ని పదాల తేడాతో ఈ విషయానికి సంబంధించిన హదీసులు హజ్రత్ ఉబై బిన్ కఅబ్ (ర), హజ్రత్ అబూసయీద్ ఖుద్రి, హజ్రత్ అబూహురైరా (రిజ్వానుల్లాహి తఆలా) ద్వారా ఉటంకించబడ్డాయి.

3. ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు: నాకు ఆరు విషయాలలో ప్రవక్తలపైన ఆధిక్యతనివ్వబడింది. (1) నాకు సమగ్రంగా సంగ్రహంగా మాటలాడే సామర్థ్యం ఇవ్వబడింది. (2) నాకు ప్రాభవ దర్పాలు ప్రసాదించి సహాయపడటం జరిగింది. (3) నాకు యుద్ధప్రాప్తి (పొందడం) ధర్మసమ్మతం చెయ్యబడింది. (4) నా కోసం భూమిని మస్జిద్‌గా చెయ్యడం జరిగింది, పరిశుద్ధత పొందే సాధనంగా కూడా చెయ్యడం జరిగింది. (అంటే నా షరీఅత్ ప్రకారం నమాజ్ కేవలం ప్రత్యేక ఆరాధనాలయాల్లో మాత్రమే కాదు, భూతలాన ప్రతి చోటా

చెయ్యవచ్చు. నీరు దొరక్కపోతే- నా షరీఅత్ ప్రకారం, తయమ్ముమ్ ద్వారా వుజూ అవసరాన్నీ గుస్ల్ అవసరాన్నీ తీర్చుకోవచ్చు.) (5) నన్ను యావత్తు ప్రపంచానికి ప్రవక్తగా చెయ్యడం జరిగింది. (6) నా తరువాత ప్రవక్తల పరంపరను అంతమొందించడం జరిగింది. (ముస్లిమ్, తిర్మిజి, ఇబ్నుమాజ)

4. దైవసందేశహరులు (స) ఇలా నుడివారు: దైవదౌత్యం, ప్రవక్తా బాధ్యతల క్రమం అంతమయిపోయింది. నా తరువాత దైవ సందేశహరుడూ లేడు, దైవప్రవక్తా రాడు. (తిర్మిజి: కితాబుర్రూయా, జహాబున్నబువ్వ అధ్యాయం; ముస్నద్ అహ్మద్: అనస్ బిన్ మాలిక్ (ర) ఉల్లేఖనాలు)

5. ప్రవక్త మహనీయులు (స) ఉపదేశించారు: నేను ముహమ్మద్‌ని. నేను అహ్మద్‌ని. నేను మాహిని- నా ద్వారా తిరస్కారం రూపుమాపబడుతుంది. నేను హాషిర్‌ని- నా తరువాత జనులు ఇక హష్ర్ (ప్రళయం)లోనే సమావేశపరచబడతారు. (అంటే నా తరువాత ఇక ప్రళయమే వస్తుంది). నేను ఆకిబ్‌ని- మరి ఆకిబ్ అంటే అతని తరువాత ప్రవక్త రానివాడు అన్నమాట.

(బుఖారి, ముస్లిమ్: కితాబుల్ ఫజాయిల్, అస్మా ఉన్నబీ అధ్యాయం; తిర్మిజి: కితాబుల్ ఆదాబ్, అస్మా ఉన్నబీ అధ్యాయం; ముఅత్తా: కితాబ్ అస్మా ఉన్నబీ; అల్ ముస్తద్‌రిక్ లిల్‌హాకిమ్: కితాబుత్తారీఖ్, అస్మాఉన్నబీ అధ్యాయం).

6. ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు: పరమ ప్రభువు అల్లాహ్ ఏ ప్రవక్తనయినా పంపగా అతను తన అనుచర సమాజాన్ని 'దజ్జాల్' ప్రభవన గురించి భయపెట్టకుండా వదల్లేదు. (కాని దజ్జాల్ వారి కాలాల్లో రాలేదు). ఇప్పుడు నేను చివరి ప్రవక్తను, మీరేమో చివరి అనుచర సముదాయం. ఇప్పుడు తప్పనిసరిగా వాడు మీ మధ్యనే ప్రభవిస్తాడు. (ఇబ్నుమాజ: కితాబుల్ ఫితన్, అద్ దజ్జాల్ అధ్యాయం)

7. అబ్దుర్రహ్మాన్ బిన్ జుబైర్ ఇలా అన్నారు, "నేనొక రోజున అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ ఇలా పలుకుతూ ఉండగా విన్నాను, ఒక రోజు ప్రవక్త మహనీయులు (స) తన ఇంటి నుండి బయలుదేరి మా మధ్యన వచ్చారు. ఆయన తీరు చూస్తే ఆయన మన నుండి వీడ్కోలు తీసుకుంటూ ఉన్నట్టుగా కనిపించింది. అప్పుడు ఆయన మూడు మార్లు, "నేను ముహమ్మద్‌ని, నిరక్షరాస్యుడనయిన ప్రవక్తను", ఇంకా ఇలా అన్నారు, "నా తరువాత మరో ప్రవక్త లేడు." (ముస్నద్ అహ్మద్, అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ ఉల్లేఖనాలు)

8. దైవసందేశహరులు (స) ఇలా సెలవిచ్చారు, "నా తరువాత ఇక దైవదౌత్యం లేదు. కేవలం శుభవార్తనిచ్చే వచనాలుంటాయి." "ఆ శుభవార్తలనిచ్చే వచనాలేమిటి దైవప్రవక్తా" అని అడగ్గా, "మంచి స్వప్నం", లేక "పుణ్యప్రదమయిన స్వప్నం" అని అన్నారు. (అంటే, ఇక వహీ అవతరించే అవకాశం లేదు; దైవం తరఫున ఏదయినా సంకేతం ఎవరికయినా లభిస్తే అది ఇతోధికం అది మంచి కల ద్వారా ప్రాప్తిస్తుందన్నమాట). (ముస్నద్ అహ్మద్, అబూతుఫైల్ ఉల్లేఖనాలు; నసాయి; అబూదావూద్)

9. ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు, "నా తరువాత ఎవ రయినా ప్రవక్త అయ్యే మాటయితే ఉమర్ బిన్ ఖత్తాబ్ అయ్యేవారు." (తిర్మిజి, కితాబుల్ మనాకిబ్)

10. దైవ సందేశహరులు (స) హజ్రత్ అలీ (ర)తో ఇలా అన్నారు, "నాకూ నీకూ గల సంబంధం మూసాకు హారూన్‌తోగల సంబంధం వంటిదే. నా తరువాత మరో ప్రవక్త లేడు." (బుఖారి, ముస్లిమ్, కితాబ్ ఫజాయి లుస్సహాబా.)

బుఖారీ, ముస్లిమ్ ఈ హదీసులు తబూక్ యుద్ధం సందర్భంలోనూ ఉటంకించారు. ముస్నద్ అహ్మద్‌లో ఇదే విషయాన్ని ప్రస్తావించే రెండు

హదీసులు హజ్రత్ సఅద్ బిన్ అబీ వక్కాస్ ఉల్లేఖించినవి వచ్చాయి. వాటి చివరి వాక్యం ఇలా ఉంది: "కాని నా తరువాత మరే దైవదౌత్యమూ లేదు." అబూదావూద్, తయాలిసీ, ఇమామ్ అహ్మద్, ముహమ్మద్ బిన్ ఇస్‌హాక్, ప్రభృతులు ఈ సందర్భంలో ఉటంకించిన ఉల్లేఖనాల ద్వారా తెలిసే దేమిటంటే, తబూక్ పోరాటానికి వెడుతూ, ప్రవక్త మహనీయులు (స) హజ్రత్ అలీని తన వెనకాల మదీనా రక్షణను పర్యవేక్షకునిగా నియమించాలని నిర్ణయించారు. కపటులు రకరకాల మాటలు ఆయన గురించి చెప్పుకో సాగారు. ఆయన వెళ్ళి ప్రవక్తశ్రీ(స)కి చెప్పారు, "దైవప్రవక్తా, మీరు నన్ను మహిళల్లోనూ, పిల్లల్లోనూ వదలిపెట్టిపోతున్నారా?" అని అడగ్గా, ప్రవక్తశ్రీ(స) ఆయనకు ఓదార్పునిచ్చి, "నీకు నాకూ మధ్య సంబంధం, మూసాకు, హారూన్‌తో ఉన్నటువంటిదే." అంటే ఏ విధంగా మూసా తూర్ కొండ పైకి వెడుతూ హజ్రత్ హారూన్‌ని బనీ ఇస్రాయీల్ రక్షణకుగా నియమించి వెళ్ళారో, అదే విధంగా నేను నిన్ను మదీనా పరిరక్షణకు వదలిపెట్టి పోతున్నాను. కాని వెంటనే ప్రవక్తశ్రీ (స)కి సంశయం కలిగింది, హజ్రత్ హారూన్‌తో ఈ పోలిక, తరువాత ఏదయినా పరీక్షా ఉపద్రవానికి కారణమవు తుందేమోనన్న అనుమానంతో ఆయన వెంటనే దానికి ఈ విశదీకరణ కూడా ఇచ్చారు, నా తరువాత మరే వ్యక్తి కూడా ప్రవక్త అయ్యే ప్రసక్తేలేదు అని.

11. సౌబాన్ ఉల్లేఖనం ప్రకారం, ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు, ".......ఇంకా నా అనుచర సముదాయంలో ముప్పయి మంది అబద్ధం పలికే వ్యక్తులు ఉద్భవిస్తారు. వారిలో ప్రతి ఒక్కడూ తాను ప్రవక్తనని వాదిస్తాడు. వాస్తవం ఏమిటంటే నేను అంతిమ ప్రవక్తను, నా తరువాత మరే ప్రవక్తా రాడు." (అబూదావూద్, కితాబుల్ ఫితన్)

ఇదే విషయమున్న మరో హదీసు అబూదావూద్, కితాబుల్ మలాహిమ్‌లో హజ్రత్ అబూహురైరా ఉల్లేఖించినట్లు ఉటంకించారు. తిర్మిజి కూడా హజ్రత్ సౌబాన్, హజ్రత్ అబూహురైరా ద్వారా ఈ రెండు ఉల్లేఖనాలూ ఉటంకించారు. రెండవ ఉల్లేఖనంలోని పదాలు ఇవి: "కడకు దాదాపు

ముప్ఫయి మంది అబద్ధాల వంచకులు ఉద్భవిస్తారు. వారిలో ప్రతి ఒక్కడూ తాను అల్లాహ్ సందేశహరుణ్ణి అని వాదన చేస్తాడు."

12. ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు, "మీకు ముందు గతించిన బనీఇస్రాయీల్‌లో వారు ప్రవక్తలు కాకపోయినా (దైవం) వారితో సంభాషించేటటువంటి వారుండేవారు. నా అనుచర సంఘంలో ఎవరయినా అలా కాగలిగితే అతను ఉమర్ (ర) అయ్యేవాడు." (బుఖారి: కితాబుల్ మనాకిబ్)

ఈ విషయంతోటే ముస్లిమ్‌లో ఉన్న హదీసులో يكلّمون అనే పదానికి బదులు يحدثون అనే పదముంది. కాని రెండు పదాల భావమూ ఒక్కటే. అంటే దైవసంభాషణా భూషితుడయిన లేక తెరచాటుగా మాట్లాడబడిన వ్యక్తి అని అర్థం. అంటే దైవదౌత్యం లేకపోయినా దైవసంభాషణానుగ్రహం పొందే వ్యక్తి, ఈ అనుచర సమాజంలో ఎవరయినా కాగలిగితే ఆయన హజ్రత్ ఉమర్ (ర) అయ్యేవారన్నమాట.

13. ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు, "నా తరువాత మరే ప్రవక్త లేడు. నా అనుచర సమాజం తరువాత మరో అనుచర సమాజమూ (కొత్తగా వచ్చే ప్రవక్త అనుచరసమాజం) లేదు." (బైహకీ, కితాబుర్రూ'యా, తబ్రాని)

14. ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు, "నేను చివరి ప్రవక్తను. నా మస్జిద్ చివరి మస్జిద్ (మస్జిదున్నబవి).★ (ముస్లిమ్: కితాబుల్ హజ్జ్, ఫజ్లుస్సలాత్, బిమస్జిద్ మక్కావల్ మదీనా)

★దైవదౌత్యం ముగింపును తిరస్కరించే వారు ఈ హదీసు ద్వారా చేసే వాదన ఇలా ఉంటుంది: ఏ విధంగానయితే ప్రవక్తశ్రీ (స) తన మస్జిద్‌ని చివరి మస్జిద్‌గా అన్నారో- నిజానికి అది చివరి మస్జిద్ కాదు, దాని తరువాత కూడా అసంఖ్యాక మయిన మస్జిదులు ప్రపంచంలో నిర్మించబడ్డాయి- అదే విధంగా నేను చివరి ప్రవక్తనని ఆయన అన్నారంటే దాని అర్థం కూడా ఇదే, ఆయన తరువాత కూడా

(మిగతా తరువాతి పేజీలో)

ఈ హదీసులు అత్యధికమంది సహచరులు, ప్రవక్త మహనీయుల ద్వారా ఉల్లేఖించారు. చాలా మంది హదీసువేత్తలు వీటిని అనేక బలమయిన ప్రమాణాలతోపాటు ఉటంకించారు. వీటిని బట్టి స్పష్టంగా తెలిసేదేమిటంటే, ప్రవక్తశ్రీ (స), తాను చివరి ప్రవక్తనని, తన తరువాత మరో ప్రవక్త ఎవరూ రాబోవటం లేదని, దైవదౌత్య పరంపర తనతోనే అంతమయిపోయిందని,

---

ప్రవక్తలు వస్తూ ఉంటారు. అయితే ఘనత రీత్యా, ఆయన చివరి ప్రవక్త, ఆయన మస్జిద్ చివరి మస్జిద్, అని వారు వాదిస్తారు. అయితే వాస్తవానికి ఇటువంటి వాదనల వల్లనే ఈ వ్యక్తులు దైవం, దైవప్రవక్తల వచనాలను అర్థం చేసుకునే సామర్థ్యం కోల్పోయారని రుజువవుతుంది. సహీహ్ ముస్లిమ్‌లో ఈ హదీసు వచ్చినచోట ఆ క్రమంలోని హదీసులన్నింటినీ స్థూలంగా పరిశీలించినా తెలిసిపోతుంది, ప్రవక్తశ్రీ తన మస్జిద్‌ని ఏ భావంలో చివరి మస్జిద్ అన్నారో. ఆ సందర్భంలో హజ్రత్ అబూ హురైరా, హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్, ఉమ్ముల్ మూ'మినీన్ హజ్రత్ మైమూన ద్వారా, ఇమామ్ ముస్లిమ్ ఉటంకించిన ఉల్లేఖనాలన్నింటిలో తెలిపిన విషయం ఒక్కటే. ప్రపంచంలో సాధారణ మస్జిదులపైన ప్రాధాన్యత, ఘనతగల మస్జిదులు మూడే. వీటిలో నమాజ్ చెయ్యడం ఇతర మస్జిదుల్లో నమాజ్ చెయ్యడంకన్నా వెయ్యి రెట్లు అధికంగా పుణ్యప్రదమయినది. అందువల్లనే ఈ మూడు మస్జిదుల్లో నమాజ్ చెయ్యడానికి ప్రయాణం చెయ్యడం ధర్మసమ్మతం. మిగతా ఏ మస్జిద్‌కు ఈ హక్కులేదు- మనిషి ఇతర మస్జిదుల్ని వదలి ప్రత్యేకంగా అందులోనే నమాజ్ చేసేందుకు ప్రయాణం చేసి వెళ్ళడానికి. వీటిలో తొలి మస్జిద్, మస్జిదుల్ హరామ్, దీనిని హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) నిర్మించారు. రెండవది మస్జిదుల్ అక్సా, దీనిని హజ్రత్ సులైమాన్ (అ) నిర్మించారు. మూడవ మస్జిద్ మదీనా పవిత్ర నగరిలోని మస్జిదున్నబవి, దీనికి ప్రవక్తశ్రీ (స) పునాది వేశారు. ప్రవక్తశ్రీ చెప్పినదాని భావమేమిటంటే, ఇక నా తరువాత మరే ప్రవక్త రావడం లేదు కాబట్టి నా ఈ మస్జిద్ తరువాత ప్రపంచంలో మరో నాల్గవ మస్జిద్ ఏదీ నిర్మాణమవబోదు- అందులో నమాజ్ చేసినట్లయితే ఇతర మస్జిదుల కన్నా అధిక పుణ్యప్రదమవడానికి, నమాజ్ చేసేందుకు దాని వద్దకు ప్రయాణం చేసి వెళ్ళడానికి.

తన తరువాత ఎవరయితే దైవసందేశహరులని, ప్రవక్తలని వాదిస్తారో వారు దజ్జాల్, కిజ్జాబ్‌లు అని అనేక సందర్భాలలో విభిన్న విధాలుగా విభిన్న పదాలలో సవివరంగా నొక్కివక్కాణించరన్నమాట. ఖుర్‌ఆన్‌లోని "ఖాతమన్న బీయ్యీన్" "خاتم النبيين" అనే పదాలకు ఇంతకన్నా ప్రామాణికమయిన, విశ్వసనీయమయిన, నిర్భేద్యమయిన అంతిమ నిరూపణలున్న వివరణ మరేది కాగలదు? ప్రవక్త మహనీయులు సెలవిచ్చిన వచనాలు స్వయంగా ప్రమాణం, తిరుగులేని వాదన. కాని అది ఖుర్‌ఆన్‌లోని ఒక మూలాదేశాన్ని విశదీకరించేదయితే అది మరీ బలమయిన వాదనగా రూపొందుతుంది. ఇక మహనీయ ముహమ్మద్ (స)కన్నా అధికంగా ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకునే వారు, దాని వివరణ చేసే హక్కుగలవారు మరెవరు కాగలరు- దైవదౌత్యం ముగింపునకు మరేదయినా అర్థం చెప్పడానికి దాన్ని మనం స్వీకరించడం అలా ఉంచి, దాని పట్ల శ్రద్ధ చూపడానికయినా అర్హత ఎవరికయినా ఉందను కోవడానికి?

ప్రవక్త సహచరుల ఏకాభిప్రాయం

ఖుర్‌ఆన్, సున్నత్ (ప్రవక్త సంప్రదాయం) తరువాత మూడవ స్థానంలో ప్రవక్త సహచరుల విస్తృత ఏకాభిప్రాయానికి లభిస్తుంది. ప్రవక్త మహనీయులు దివంగతులయిన తరువాత వెంటనే ఎవరెవరయితే దైవదౌత్య ప్రకటన చేశారో, మరెవరయితే వారి దైవదౌత్యాన్ని అంగీకరించారో వారందరికీ విరుద్ధంగా ప్రవక్త సహచరులు ఏకాభిప్రాయంతో యుద్ధం చేశారన్న విషయం సమస్త విశ్వసనీయ చారిత్రక ఉల్లేఖనాల ద్వారా రుజువయినదే.

ఈ సందర్భంలో ప్రత్యేకంగా ముసైలిమా కజ్జాబ్ వ్యవహారం పేర్కొన దగ్గది. ఈ వ్యక్తి దైవప్రవక్త (స) దైవదౌత్యాన్ని తిరస్కరించలేదు. అతని వాదన ఏమిటంటే, అతన్ని ప్రవక్తశ్రీ (స)తోపాటు దైవదౌత్యంలో సహవర్తినిగా నియమించడం జరిగింది. అతను ప్రవక్తశ్రీ (స) దివంగతులవడానికి పూర్వం ఆయనకు వ్రాసిన లేఖలోని పదాలు ఇలా ఉండేవి:

ముసైలిమ దైవసందేశహరుని తరపున, ముహమ్మద్ దైవసందేశ హరులకు. మీకు సలాములు. నేను మీకు తోడుగా దైవదౌత్య కార్యంలో సహవర్తునిగా నియమించబడ్డానన్న సంగతి మీరు ఇందుమూలంగా తెలుసుకోండి.

ఇదేకాక చరిత్రకారుడు తబరి ఉల్లేఖనం ప్రకారం ముసైలిమా వద్ద అజాన్ (నమాజ్ పిలుపు) ఇవ్వబడినప్పుడు అందులో "ముహమ్మద్ దైవసందేశహరుడని సాక్ష్యం పలుకుతున్నాను" అనే పదాలు కూడా పలకబడేవి. ఇంత విశదంగా ముహమ్మద్ దైవదౌత్యాన్ని అంగీకరించినప్పటికీ అతన్ని తిరస్కారిగా, ముస్లిమ్ సముదాయం నుండి వేరుగా పరిగణించడం జరిగింది. అతనితో యుద్ధం చేయబడింది. చరిత్ర ప్రకారం, బనూ హనీఫా తెగవారు సత్సంకల్పంతో (In good faith) అతన్ని విశ్వసించిన విషయమూ రూఢమయినదే. వారిని నిజంగానే అపార్థంలో పడవేయటం జరిగింది. దైవసందేశహరులు ముహమ్మద్(స) స్వయంగా అతన్ని తన దైవదౌత్యంలో సహవర్తునిగా చేసుకున్నారని నమ్మించారు. అంతేకాదు ఖుర్‌ఆన్ ఆయత్ లను, ముసైలిమాకు అవతరించిన ఆయత్‌లుగా వారి సమక్షంలో వినిపించ డమూ జరిగింది. అలా సమర్పించిన వ్యక్తి మదీనా పవిత్ర నగరి నుండి ఖుర్‌ఆన్ బోధనలు నేర్చుకుని వెళ్ళినవాడు. (అల్‌బిదాయ వన్నిహాయ లి ఇబ్నుకసీర్ సం.5, పు.51). ఇంత జరిగినప్పటికీ మహనీయ సహచరులు వారిని ముస్లిములుగా అంగీకరించలేదు. వారి మీదికి దాడి జరిపారు. సహచర గణం వారి మీదికి దాడి జరిపింది ధర్మభ్రష్టత కారణంగా కాదు, తిరుగుబాటు కారణంగా అని చెప్పేందుకు కూడా తావులేదు. ఇస్లామీయ శాసనాంగం రీత్యా తిరుగుబాటు చేసిన ముస్లిములకు ఎదురుగా యుద్ధం చేయవలసి వచ్చినా వారి యుద్ధ ఖైదీలను బానిసలుగా చేసుకోవడం జరగదు. అంతేకాదు, ముస్లిములు మాత్రమేకాదు, జిమ్మీలు సయితం తిరుగుబాటు చేసినట్లయితే పట్టుబడిన తరువాత వారిని బానిసలుగా చేసుకోవడం ధర్మసమ్మతం కాదు. కాని ముసైలిమా, అతని అనుయాయుల మీదికి దాడి జరిపినప్పుడు హజ్రత్

అబూబక్ర్ (ర), వారి స్త్రీలను, పిల్లలను బానిసలుగా చేసుకోవాలని ప్రకటించారు. వారు పట్టుబడినప్పుడు నిజంగానే వారిని బానిసలుగా చేసుకోవడం జరిగింది. తదనుగుణంగా ఒక బానిస హజ్రత్ అలీ (ర) వాటాలో వచ్చింది. ఆమె కడుపులోనే ఇస్లామీయ చరిత్రలోని ప్రఖ్యాత వ్యక్తిత్వం "ముహమ్మద్ బిన్ హనఫియ"★ పుట్టారు. (అల్ బిదాయ వన్నిహాయ, సం.6, పు. 316, 325). దీని ద్వారా ఒక విషయం తేటతెల్లమయి పోతుంది. మహనీయ సహచరగణం (ర) వారితో పోరాడింది- తిరుగుబాటు నేరం కారణంగా కాదు. ఒక వ్యక్తి మహనీయ ముహమ్మద్ (స) తరువాత దైవదౌత్య ప్రకటన చేయగా ఇతరులు అతని దైవదౌత్యాన్ని నమ్మారన్న నేరం కారణంగా. ఈ సైనిక చర్య ప్రవక్తశ్రీ (స) మరణానంతరం వెంటనే జరిగింది, హజ్రత్ అబూబక్ర్ (ర) నేతృత్వంలో జరిగింది, సహచరగణం (ర) యావన్మంది సంఘటితంగా ఏకాభిప్రాయంతో జరిగింది. సహచరుల (ర) ఏకాభిప్రాయానికి ఇంతకు మించిన మరో ఉదాహరణ బహుశా ఏదీ లేదు.

సముదాయంలోని ధర్మవేత్తలందరి ఏకాభిప్రాయం

ధార్మిక సమస్యల్లో ప్రవక్త సహచరుల ఏకాభిప్రాయం తరువాత నాల్గవ స్థానంలో వాదన స్థాయిగల అంశం ప్రవక్త సహచరుల తరువాతి కాలం నాటి ధర్మవేత్తల ఏకాభిప్రాయం. ఈ విషయం దృష్ట్యా చూసినట్లయితే తొలి శతాబ్ది నుండి నేటి వరకు అన్ని కాలాల్లో, ఇస్లామీయ ప్రపంచమంతటా ప్రతి దేశంలోని ధర్మవేత్తలు ఏకాభిప్రాయం కలిగి ఉన్న విశ్వాసం, మహనీయ ముహమ్మద్ (స) తరువాత ఏ వ్యక్తీ ప్రవక్త కాజాలడు అన్నదే; ఇంకా ఆయన తరువాత ఎవరయితే ఆ యోగం తనకు ఉందని ప్రకటిస్తాడో మరెవడయితే దాన్ని నమ్ముతాడో అతను ఇస్లామీయ సముదాయం నుండి బయటపడిన తిరస్కారి. ఈ సందర్భంలో కొన్ని నిరూపణలు చూడండి:

★'హనఫియ' అని అంటే బనూ హనీఫా తెగకు చెందిన స్త్రీ అని భావం.

1. ఇమామ్ అబూ హనీఫా (హి. 80 నుండి 150 వరకు) కాలంలో ఒక వ్యక్తి దైవదౌత్య ప్రకటన చేశాడు. "నేను నా దైవదౌత్య సూచనలు చూపడానికి నాకు అవకాశన్నివ్వండి" అని కోరాడు. దానికి ఇమామ్ ఆజమ్ ఇలా అన్నారు, "ఎవరయితే ఈ వ్యక్తిని అతని దైవదౌత్య సూచనలు చూపెట్టమని అడుగుతారో అతను కూడా తిరస్కారియే అవుతాడు. ఎందుకంటే ప్రవక్త మహనీయులు 'నా తరువాత ప్రవక్త లేడు' అని చెప్పివేశారు." (మనాకిబ్ అల్ ఇమాముల్ ఆజమ్ అబీ హనీఫా లిబ్ని అహ్మద్ అల్ మక్కి-సం.1, పు. 161, ముద్రణ: హైదరాబాద్, 1321 హి.)

2. అల్లామా ఇబ్ను జరీర్ తబరి (హి. 224 నుండి 310 వరకు) తన ప్రఖ్యాత ఖుర్‌ఆన్ వ్యాఖ్యాన గ్రంథంలో "وَلٰكِنْ رَّسُوْلَ اللّٰهِ وَخَاتَمَ النَّبِيّٖنَ" అనే పదాలకు భావం చెబుతూ, "ఎవరయితే దైవదౌత్యాన్ని అంత మొందించాడో, దానిపైన సీలు ముద్ర వేశాడో ఆయన. ఇక ప్రళయం వరకు ఈ ద్వారం ఎవరికీ తెరచుకోదు." (వ్యాఖ్యానం, ఇబ్నుజరీర్: సం.22, పు.12)

3. అల్లామా ఇబ్ను హజ్మ్ అన్దలుసి (హి. 384 నుండి 456 వరకు) ఇలా వ్రాశారు: "నిశ్చయంగా వహీ పరంపర ప్రవక్త మహనీయులు (స) దివంగతులయిన తరువాత తెగిపోయింది. దీనికి ఆధారం ఏమిటంటే, వహీ ఒక ప్రవక్తకు తప్ప అవతరించదు. మరి పరమ ప్రభువు అల్లాహ్ ప్రకటించాడు, ముహమ్మద్ మీ పురుషులలో ఎవరికీ తండ్రి కారు, కాని ఆయన అల్లాహ్ సందేశహరులు, ప్రవక్తల అంతిమ ముద్ర అని" (అల్ ముహల్లీ- సం.1, పు. 26)

4. ఇమామ్ గజాలి (హి.450 నుండి 505 వరకు) ఇలా సెలవిస్తున్నారు: ఈ పదం (అంటే "నా తరువాత ప్రవక్త లేడు" అన్నదానికి) ఇంకా ప్రవక్త మహనీయుల ఇతర మాటలు చేతల ద్వారా సముదాయం మొత్తం ఏకాభిప్రాయంతో గ్రహించిన భావం ఒక్కటే, ప్రవక్తశ్రీ (స) చెప్పినదాని భావం, ఆయన తరువాత ఎన్నడూ ఏ ప్రవక్తా రాడు,

సందేశహరుడూ రాడు. ఇంకా ఇందులో ఎటువంటి వేరే అన్వయాలకు తావు లేదని, ఎటువంటి ప్రత్యేక అవకాశమూ లేదని కూడా సముదాయం ఏకాభిప్రాయానికి వచ్చింది. అందువల్ల ఇటువంటి వ్యక్తిని ఏకాభిప్రాయాన్ని తిరస్కరించినవాడని తప్ప మరేమీ అనలేము. (అల్ ఇక్తిసాద్ ఫిల్ ఈతికాద్, అల్ మత్బఅతల్ అదబియ, ఈజిప్ట్, పు.114)

5. ముహియుస్సున్న బగవి (మరణం హి. 510) తన వ్యాఖ్యాన గ్రంథం "ముఆలిముత్తన్జీల్"లో ఇలా వ్రాస్తున్నారు: "అల్లాహ్ ఆయన (స) ద్వారా దైవదౌత్యాన్ని ముగింపజేశాడు. కనుక ఆయన (స) ప్రవక్తలలో చివరి వారు......ఇంకా ఇబ్ను అబ్బాస్ ప్రకారం, అల్లాహ్ (ఈ ఆయత్‌లో) ప్రవక్త మహనీయులు (స) తరువాత మరే ప్రవక్త రాడని నిర్ణయించాడు." (సం.3, పు.158)

6. అల్లామా జమఖ్షరీ (హి. 467 నుండి 538 వరకు) తన వ్యాఖ్యాన గ్రంథం 'కష్షాఫ్'లో ఇలా వ్రాస్తున్నారు: ఈసా (అ) చివరి కాలంలో అవతరించనుండగా ప్రవక్త మహనీయులు (స) చివరి ప్రవక్త ఎలా అయ్యారని నీవు అడిగితే నా సమాధానం, ఆయన కడపటి ప్రవక్త అవడం అన్నదాని అర్థం ఏమిటంటే ఆయన తరువాత మరే వ్యక్తీ ప్రవక్తగా నియుక్తుడుకాడు. మరి ఈసా (అ) అయితే ఆయనకు పూర్వమే ప్రవక్తగా నియుక్తులయిన వారాయె. ఆయన తిరిగి ఆవిర్భవించడమన్నది ముహమ్మద్ (స) షరీఅత్ అనుయాయిగా, ఆయన కిబ్లా దిశకు తిరిగి నమాజ్ చేసే వారుగా ఆవిర్భవిస్తారు. అంటే ఆయన ప్రవక్త మహనీయుల సముదాయంలోని వ్యక్తిగానే వస్తారన్నమాట. (సం. 2, పు. 215)

7. కాజీ అయాజ్ (మరణం హి. 544) వ్రాశారు: ఏ వ్యక్తి అయితే తన విషయంలో దైవదౌత్య ప్రకటన చేస్తాడో, లేక దైవదౌత్యం కూడా మనిషి సాధన ద్వారా పొందగలగడం అనుమతించదగిందే అని,

మనిషి కొందరు తత్వవేత్తలు, అతిశయభావుకులయిన సూఫీలు అనుకున్నట్లు, ఆత్మశుద్ధి ద్వారా దైవదౌత్య స్థానాన్ని చేరుకోగలడని నమ్ముతాడో, అలాగే ఒక వ్యక్తి దైవదౌత్య ప్రకటన చేయకపోయి నప్పటికీ తనకు వహీ సందేశం అందుతుందని ప్రకటిస్తాడో... ఇలాంటి వారంతా తిరస్కారులే, వీరు దైవప్రవక్త (స)ను తిరస్కరించేవారే. ఎందుకంటే ఆయన తెలిపిన దాని ప్రకారం ఆయన దైవప్రవక్తలలో అంతిమమయినవారు. ఆయన తరువాత మరే ప్రవక్త రాబోవడం లేదు. ఆయన అల్లాహ్ పక్షాన అందజేసిన సమాచారం ప్రకారం ఆయన దైవదౌత్యాన్ని ముగించేవారు. మరి మానవాళి అంతటికీ ఆయన్ని పంపడం జరిగింది. ఈ వచనం దాని బాహ్య భావంలోనే వర్తిస్తుంది. దాని అర్థం, భావంలో ఎటువంటి వేరే అన్వయానికీ, ప్రత్యేకతలకు తావులేదు. అందువల్ల (పైన పేర్కొన్న) వర్గాల వారందరూ తిరస్కారులవడంలో నిక్కచ్చిగా ఎలాంటి అనుమానం లేదు- ఇది అందరి ఏకాభిప్రాయం ద్వారాను, ఉల్లేఖనాల ద్వారాను రూఢమయిన విషయం.'' (షిఫా: సం.2, పు. 270, 271)

8. అల్లామా షహరస్తాని (మరణం హి. 548) తన ప్రఖ్యాత గ్రంథం ''అల్ మిలల్ వన్నిహల్''లో ఇలా వ్రాస్తున్నారు: ''అలాగే ఎవరయితే... ప్రవక్త ముహమ్మద్ (స) తరువాత మరో ప్రవక్త వస్తారని అంటారో (ఈసా-అ-తప్ప) అతను తిరస్కారి అవడంలో ఏ ఇద్దరు వ్యక్తుల మధ్యనూ భేదాభిప్రాయం లేదు.'' (సం.3, పు. 249).

9. ఇమామ్ రాజి (హి. 543 నుండి 606 వరకు) తన వ్యాఖ్యాన గ్రంథం ''కబీర్''లో "خاتم النبيين" అనే ఆయత్‌ని విశదీకరిస్తూ ఇలా వ్రాస్తున్నారు: ''ఈ సందర్భంలో "خاتم النبيين" అని ఎందుకు పేర్కొనడం జరిగిందంటే, ఒక ప్రవక్త తరువాత మరో ప్రవక్త ఉన్న పక్షంలో తొలిప్రవక్త ఉపదేశంలో, ఆదేశాల వివరణలో ఏదయినా వెలితి వదలిపెట్టినా ఆ తరువాత వచ్చే ప్రవక్త దాన్ని పూర్తి చేయ

గలడు, అయితే ఒక ప్రవక్త తరువాత మరో ప్రవక్త రాబోవడంలేని స్థితిలో ఆ ప్రవక్త తన అనుచర సముదాయం పట్ల ఇతోధిక దయగల వాడయి ఉంటాడు. దానికి ఇతోధిక విశద మయిన మార్గదర్శకత్వాన్ని అందజేస్తాడు. ఎందుకంటే అతని ఉపమానం ఒక తండ్రి లాంటిది. తండ్రికి బాగా తెలుసు తన సంతానానికి తన తరువాత మరెవరూ సహాయకులూ సంరక్షకులూ లేరని." (సం.6, పు.581)

10. అల్లామా బైజావి (మరణం హి. 685) తన వ్యాఖ్యాన గ్రంథం "అన్వారుత్తన్జీల్"లో ఇలా వ్రాస్తున్నారు: "అంటే ఆయన ప్రవక్తల్లో కట్టకడపటి ప్రవక్త. ఆయన ఈ పరంపరను ముగించారు, లేదా ఈయన ద్వారా ప్రవక్తల పరంపరకు సీలు వేయబడింది. మరి ఈసా (అ), ఆయన (స) తరువాత ప్రభవించడం ఈ దైవదౌత్యం ముగింపునకు అడ్డుకాదు. ఎందుకంటే ఆయన ఆవిర్భవిస్తే ఆయన (స) ధర్మాన్నే ఆచరిస్తారు." (సం.4, పు. 164)

11. అల్లామా హాఫిజుద్దీన్ అన్నసఫి (మరణం హి. 710) తన వ్యాఖ్యాన గ్రంథం "మదారికుత్తన్జీల్"లో ఇలా వ్రాస్తున్నారు, "ఆయన (స) అంతిమ దైవప్రవక్తలు... అంటే ప్రవక్తలో చిట్టచివరివారు. ఆయన తరువాత మరే వ్యక్తి కూడా ప్రవక్తగా నియుక్తుడవడు. పోతే ఈసా (అ), ఆయన ప్రవక్త మహనీయులకు పూర్వమే ప్రవక్తగా నియుక్తులయినవారు. ఆయన తిరిగి ఆవిర్భవించినప్పుడు ముహమ్మద్ షరీఅత్‌నే పాటించేవారుగా వస్తారు. అంటే ఆయన (స) అనుచర సమాజంలోని వ్యక్తిగా అన్నమాట." (పు.471)

12. అల్లామా అలా ఉద్దీన్ బగ్దాదీ (మరణం హి. 725) తన వ్యాఖ్యాన గ్రంథం "ఖాజన్"లో ఇలా వ్రాశారు: "అంటే అల్లాహ్ ఆయనతో దైవదౌత్యాన్ని అంతమొందించాడు. ఇక ఆయన తరువాత దైవ దౌత్యమూ లేదు, ఆయనతోపాటు మరెవరయినా దైవదౌత్యంలో

సహవర్తులూ లేరు. అంటే ఈ మాట అల్లాహ్ జ్ఞానపరిధిలోనే ఉంది. ఆయన తరువాత మరే ప్రవక్తా లేడని." (పు. 471, 472)

13. అల్లామా ఇబ్ను కసీర్ (మరణం హి. 774) తన ప్రఖ్యాత వ్యాఖ్యాన గ్రంథంలో ఇలా వ్రాస్తున్నారు: కాగా ఈ ఆయత్ ఈ విషయంలో స్పష్టమయిన దైవాదేశం. అంటే ప్రవక్త మహనీయుల తరువాత మరో ప్రవక్త లేడు. ఆయన తరువాత ప్రవక్తే లేనప్పుడు సందేశహరుడు అసలే లేడని అర్థం. ఎందుకంటే దైవసందేశహరుని పదవి ప్రత్యేక మయినది, దైవప్రవక్తా బాధ్యత సామాన్య మయినది. ప్రతి సందేశహరుడు తప్పక ప్రవక్త అవుతాడు కాని ప్రతి ప్రవక్త సందేశ హరుడుకాడు... ప్రవక్తశ్రీ (స) తరువాత ఏ వ్యక్తి అయినా ఆ స్థానం తనకున్నట్లు ప్రకటించినట్లయితే అతను అసత్యవాది, అబద్ధకల్పన చేసేవాడు, దజ్జాల్, మార్గవిహీనుడు, మార్గం తప్పించేవాడూను. అతను ఎటువంటి అనహజమయిన గారడీ విద్యలు, మంత్ర తంత్రాలు చూపినా, మహిమలు చూపినా.. ప్రళయం వరకు ఈ స్థానం తనకుందని ప్రకటించే ప్రతి వ్యక్తిదీ ఇదే స్థితి. (సం.3, పు.493, 494)

14. అల్లామా జలాలుద్దీన్ సుయూతీ (మరణం హి. 911) తన వ్యాఖ్యాన గ్రంథం "జలాలైన్"లో ఇలా వ్రాశారు: " "وَكَانَ اللّٰهُ بِكُلِّ شَيْءٍ عَلِيْمًا" అని అంటే అల్లాహ్‌కు తెలుసు ప్రవక్త మహనీయుల (స) తరువాత మరో ప్రవక్త రాబోవటం లేదని. ఈసా (అ) ఆవిర్భవించనున్నప్పుడు ఆయన ప్రవక్త (స) షరీఅత్ ప్రకారమే ఆచరిస్తారు." (పు.768)

15. అల్లామా ఇబ్నుసుజైమ్ (మరణం హి.970) ఫిక్‌హ్‌కు సంబంధించిన ప్రఖ్యాత సిద్ధాంత గ్రంథం "అల్ అష్‌బాహ్ వన్నజాయిర్" లోని కితాబుస్సియర్; అర్రిద్ధ అధ్యాయంలో ఇలా వ్రాస్తున్నారు: "మనిషి ఒక వేళ ముహమ్మద్ (స) చివరి ప్రవక్త అని నమ్మకపోతే అతను

ముస్లిమ్ కాదు. ఎందుకంటే ఈ విషయం తెలుసుకోవలసిన, నమ్మవలసిన ధార్మిక అవశ్యకతల్లోనిది." (పు.179)

16. ముల్లా అలీకారి (మరణం హి. 1016) "షరహ్ ఫికహ్ అక్బర్"లో ఇలా వ్రాశారు: మన ప్రవక్త (స) తరువాత దైవదౌత్య ప్రకటన చెయ్యడం ఏకాభిప్రాయంతో తిరస్కార సమానం. (పు. 202)

17. షేఖ్ ఇస్మాయీల్ హక్కి (మరణం హి. 1137) 'రూహుల్ బయాన్' అనే వ్యాఖ్యాన గ్రంథంలో ఈ ఆయత్ వివరణ వ్రాస్తూ ఇలా అన్నారు: "ఆసిమ్ خاتم (ఖాతమ్)లోని 'త' అక్షరం జబర్ (తలకట్టు)తో పఠించాడు. అంటే అర్థం ముగింపు చేసే పనిముట్టు అని, సీలు ముద్ర వేసే పనిముట్టు అని. ముద్ర వేసే యంత్రాన్ని ముద్రణ యంత్రమన్నట్టు. భావమేమిటంటే, ప్రవక్త మహనీయులు అందరికీ చివరన వచ్చారు. ఆయన ద్వారా ప్రవక్తల పరంపర పైన సీలు ముద్ర వేయబడింది. ఫార్సీలో దీన్ని 'ముహ్రె పైగంబరాఁ' అనాలి. అంటే ఆయన రాకతో దైవదౌత్య ద్వారం సీలు చేసి వేయబడినది, ప్రవక్తల పరంపర ముగించబడింది. మిగతా పాఠకులు 'త'కు జేర్ (గుడి)తో పఠించారు. خاتم (ఖాతిమ్) అంటే ఆయన ముద్రవేసే వారు అన్నమాట. ఫార్సీలో దీన్ని 'ముహర్ కునిందయె పైగంబరాఁ' (ప్రవక్తల పరంపరకు సీలు ముద్రవేసేవారు) అనాలి. ఈ విధంగా ఈ పదం కూడా ఖాతమ్ అనే పదానికే సమానార్థకమవుతుంది... ఇక ఆయన (స) అనుచర సమాజంలోని పండితులు ఆయన ద్వారా విలాయత్ (దైవ సాన్నిధ్యం) వంటి వారసత్వమే పొందగలరు. దైవదౌత్య వారసత్వం ఆయన అంతిమ తత్వం కారణంగా ముగిసి పోయింది. ఆయన తరువాత ఈసా (అ) రాక ఆయన (స) అంతిమ ప్రవక్త అవడంలో అవాంతరం కాజాలదు. ఎందుకంటే అంతిమ ప్రవక్త అవడమంటే అర్థం ఆయన తరువాత మరెవరూ ప్రవక్తగా నియుక్తులవరన్న మాట... ఈసా ఆయనకు పూర్వమే ప్రవక్తగా నియుక్తులయ్యారు. ఇక ఈయన ఆవిర్భవిస్తే ముహమ్మద్ (స) షరీఅత్ని

అనుసరించే వారిగానే ఆవిర్భవిస్తారు. ఆయన (స) కిబ్లా అభిముఖు లయ్యే నమాజ్ చేస్తారు. ఆయన (స) అనుచర సమాజంలోని వ్యక్తిగా వ్యవహరిస్తారు. ఆయనకు వహీ అవతరించదు, ఆయన కొత్త ఆదేశాలూ ఇవ్వరు. ఆయన దైవసందేశహరుల (స)కు ఖలీఫా (ప్రతినిధి)గా వ్యవహరిస్తారు... మన ప్రవక్త తరువాత మరే ప్రవక్త లేడన్న విషయాన్నే అహ్లె సున్నత్ వల్ జమాఅత్ నమ్ముతుంది. ఎందుకంటే అల్లాహ్ సెలవిచ్చిన దాని ప్రకారం, "وَلَٰكِن رَّسُولَ اللَّهِ وَخَاتَمَ النَّبِيِّينَ" (కాని ఆయన దేవుని సందేశహరులు ప్రవక్తలందరికీ అంతిమ మయినవారు), ఇంకా ప్రవక్త మహనీయులు (స) సెలవిచ్చిన దాని ప్రకారం, " "لا نبي بعدي" (నా తరువాత మరే ప్రవక్త లేడు). ఇప్పుడెవరయినా మా ప్రవక్త తరువాత ఎవరయినా ప్రవక్త ఉన్నారని అన్నట్లయితే అతన్ని తిరస్కారిగా పరిగణించబడుతుంది. ఎందుకంటే అతను మూల ఆదేశాన్ని తిరస్కరించాడు. అలాగే ఇందులో అనుమానం వ్యక్తం చేసిన వ్యక్తిని కూడా తిరస్కారిగా పరిగణించడం జరుగుతుంది. ఇప్పుడు వాదన సత్యాన్ని అసత్యంతో పూర్తిగా వేరు చేసి వేసింది. మరే వ్యక్తి అయితే ముహమ్మద్ (స) తరువాత దైవదౌత్య ప్రకటన చేస్తాడో అతని ప్రకటన అబద్ధం తప్ప మరేమీ కాజాలదు." (సం. 22, పు.188)

18. ఫతావా అలమ్‌గీరి. దీన్ని 12వ శతాబ్ది హిజ్రీలో ఔరంగజేబు ఆదేశానుసారం భారతదేశంలోని చాలామంది ధర్మవేత్తలు కలసి సంకలనం చేశారు. అందులో ఇలా ఉంది: మనిషి ఒకవేళ ముహమ్మద్ (స) చివరి ప్రవక్త అని నమ్మకపోయినట్లయితే అతను ముస్లిమేకాడు. అతను తాను దైవప్రవక్తనని, పైగంబరునని అన్నట్లయితే అతన్ని తిరస్కారిగా నిర్ణయించడం జరుగుతుంది. (సం.2 పు.263)

19. అల్లామా షౌకాని (మరణం హి. 1255) తన వ్యాఖ్యాన గ్రంథం "ఫతహుల్ కదీర్"లో ఇలా వ్రాశారు: అత్యధిక ముస్లిమ్ ధర్మవేత్తలు

خاتم అనే పదాన్ని ت కు జేర్ (గుడి) ఇచ్చి మరీ చదివారు, ఆసిమ్ దాన్ని జబర్ (తలకట్టు)తో చదివారు. తొలి విధంగా పఠిస్తే భావం ఆయన ప్రవక్తల్ని ఇక ముగించారు అన్నది, అంటే అందరికీ చివరన వచ్చారు అన్నమాట. రెండవ పాఠం ప్రకారం భావం, ఆయన వారికి సీలు ముద్రలా అయ్యారు, తద్వారా వారి పరంపరకు సీలు వెయ్యడం జరిగిందన్నమాట, ఆయన చేరిక వల్ల వారి పరంపర పరిపూర్ణమయి శోభిల్లిందన్నమాట. (సం 4, పు. 275)

20. అల్లామా ఆలూసి (మరణం హి. 1270) 'రూహుల్ ముఆనీ' అనే తన వ్యాఖ్యాన గ్రంథంలో ఇలా వ్రాస్తున్నారు: "నబీ" అనే పదం 'రసూల్' పదాన్ని పోల్చితే సామాన్యవాచకం కనుక దైవసందేశహరులు (స) "خاتم النبيين" అవడం వల్ల ఆయన خاتم المرسلين (దైవసందేశహరుల ముగింపు) అవడం కూడా దానంతట అదే తప్పనిసరి అవుతుంది. ఆయన దైవప్రవక్తల, దైవసందేశహరుల ముగింపు అవడం అంటే ఉద్దేశం, ప్రపంచంలో నబువ్వత్ లక్షణం ఆయన పొందిన తరువాత ఇక జిన్నుల్లోనూ, మానవుల్లోనూ అందరికీ దైవదౌత్య లక్షణం దొరకడం నిలిచిపోయిందన్నమాట." (సం.22, పు.32). "దైవసందేశహరుల (స) తరువాత ఏ వ్యక్తి తనకు వహీ వస్తుందని లేక నబువ్వత్ (దైవదౌత్యం) లభ్బిందని వాదిస్తాడో అతన్ని తిరస్కారిగా నిర్ణయించడం జరుగుతుంది. ఈ విషయంలో ముస్లిముల మధ్య ఎలాంటి భేదాభిప్రాయం లేదు." (సం.22, పు.38). "దైవసందేశహరులు (స) ప్రవక్తల ముగింపు అవడం అన్న విషయం దైవగ్రంథం అతి స్పష్టంగా వివరించింది. ప్రవక్త సంప్రదాయం (సున్నత్) దాన్ని ప్రస్ఫుటంగా విశదీకరించింది. ముస్లిమ్ సముదాయం దాని పట్ల ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కనుక ఎవరయితే దానికి భిన్నంగా వాదన చేస్తారో వారిని తిరస్కారిగా పరిగణించడం జరుగుతుంది." (సం.22, పు.39)

ఇవి భారతదేశం మొదలుకుని మొరాక్కో, అందులుస్ (స్పెయిన్) వరకు, టర్కి నుండి యమన్ వరకు గల సమస్త ముస్లిమ్ దేశాల ప్రఖ్యాత ధర్మవేత్తల, ఫిక్‌హవేత్తలు, హదీసువేత్తలు, ఖుర్‌ఆన్ వ్యాఖ్యానకర్తల వివరణలు. మేము వారి పేర్లతోపాటు వారి జనన మరణ తేదీలను సయితం పొందుపరిచాము. దీనివల్ల ఎవరయినా సరే ఒకే చూపులో తెలుసుకోవడం సాధ్యమే- తొలి శతాబ్ది మొదలుకుని పదమూడవ శతాబ్ది వరకు ఇస్లామీయ చరిత్రలో ప్రతి శతాబ్దిలోని గొప్ప ధర్మవేత్తలు ఈ జాబితాలో ఉన్నారు. 14వ శతాబ్దిలోని ఇస్లామీయ ధర్మవేత్తల అభిప్రాయాలను కూడా మేము ఉటంకించగలిగేవారమే కాని కావాలనే వారిని వదలివేశాము. ఎందుకంటే ఈ కాలంలో ఉద్భవించిన దైవదౌత్య దావేదారుకు విరుద్ధంగా, అతని వ్యతిరేకతలో వీరు ఈ వ్యాఖ్యానాన్ని చేశారని ఎవరయినా అనగలరు. అందు వల్ల మేము మునుపటి పండితుల వ్రాతలనే ఉటంకించాము. వీరు నేడు వాదన చేసే ఏ వ్యక్తి వ్యతిరేకతలోనూ వారు అలా వ్రాసి ఉండరన్నది సుస్పష్టం. ఈ వ్రాతల వల్ల ఒక్క విషయం మటుకు నిర్దిష్టంగా, నిర్దుష్టంగా నిరూపితమయిపోయింది. తొలి శతాబ్ది మొదలుకుని నేటి వరకు ఇస్లామీయ జగత్తు యావత్తు ఏకాభిప్రాయంతో "خاتم النبيين" కు అర్థం, "అంతిమ ప్రవక్త" అనే భావించింది. ప్రవక్తశ్రీ (స) తరువాత దైవదౌత్య ద్వారాలు శాశ్వతంగా మూయబడ్డాయని నమ్మడం అన్ని కాలాల్లో సమస్త ముస్లిముల ఏకగ్రీవంగా అంగీకృత విశ్వాసం. ఈ విషయంలో ముస్లిముల మధ్య ఎన్నడూ ఎటువంటి భేదాభిప్రాయం ఏర్పడలేదు- ఏ వ్యక్తి అయితే దైవసందేశహరులు ముహమ్మద్ (స) తరువాత దైవసందేశహరుడు లేక ప్రవక్త అయ్యే ప్రకటన/ దావా చేస్తాడో మరెవరయితే అతని దావాను అంగీకరిస్తారో వారు ఇస్లామ్ పరిధి నుండి దూరమయి పోతారు.

ఇప్పుడు బుద్ధిగల వ్యక్తి ఎవరయినా పరిశీలించవలసిన విషయం ఒకటే. "خاتم النبيين" అనే పదానికి ఏ అర్థమయితే నిఘంటువు రీత్యా రుజువయిందో, ఏదయితే ఖుర్‌ఆన్ వచనంలోని పుర్వోత్తరాల వల్ల వ్యక్త

మవుతుందో, దేన్నయితే ప్రవక్త మహనీయులు(స) స్వయంగా వివరించారో, దేన్ని గురించి ప్రవక్త సహచరుల్లో ఏకాభిప్రాయముందో, మరి దేని విషయంలోనయితే సహచరుల కాలం నుంచి నేటి వరకు ప్రపంచంలోని ముస్లిములందరూ ఎటువంటి భేదాభిప్రాయం లేకుండా ఏకగ్రీవంగా సమ్మతిస్తూ వచ్చారో దానికి భిన్నంగా, వ్యతిరేకంగా మరో భావం గ్రహించడానికి, ఒక కొత్త దావేదారు కోసం దైవదౌత్య ద్వారాలు తెరువడానికి అవకాశం ఎక్కడిది, ఎవరయితే దైవదౌత్య ద్వారం తెరచే ఉందన్న అభిప్రాయం వ్యక్తం చేయ్యడమేకాక ఆ ద్వారం ద్వారా ఒక వ్యక్తి దైవదౌత్య పవిత్ర స్థలిలోకి ప్రవేశించినప్పుడు ఆ వ్యక్తి దైవదౌత్యాన్ని విశ్వసించారో వారిని ముస్లిములుగా స్వీకరించడం ఎలా సాధ్యమవుతుంది? ఈ సందర్భంలో ఇంకా మూడు విషయాలు గమ నార్హయినవి:

అల్లాహ్‌కు మన విశ్వాసం పట్ల ఏదయినా శత్రుత్వమా?

మొదటి విషయం ఏమిటంటే దైవదౌత్యానికి సంబంధించిన విషయం అత్యంత సున్నితమయిన విషయం. దివ్యఖుర్‌ఆన్ రీత్యా ఇది ఇస్లామ్ మౌలిక విశ్వాసాల్లోని అంశం. మౌలిక విశ్వాసాలను నమ్మడం లేక నమ్మకపోవడంపైనే మనిషి విశ్వాసం లేక తిరస్కారాలు ఆధారపడి ఉంటాయి. ఒక వ్యక్తి ప్రవక్త అయినప్పుడు అతన్ని నమ్మకపోయినట్లయితే మనిషి తిరస్కారి అయిపోతాడు. ఆ వ్యక్తి ప్రవక్త కాకపోయినా అతన్ని ప్రవక్తగా నమ్మినట్లయితే తిరస్కారి అయిపోతాడు. ఇటువంటి ఒక సున్నితమయిన విషయంలో అల్లాహ్ అజాగ్రత్తగా వ్యవహరిస్తాడని ప్రథమస్థాయిలో ఆశించలేము. మహనీయ ముహమ్మద్ (స) తరువాత ఏ ప్రవక్త అయినా వచ్చే మాటయితే పరమ ప్రభువు అల్లాహ్ స్వయంగా ఖుర్‌ఆన్‌లో అతి స్పష్టంగా విశదీకరించేవాడు. దైవసందేశహరుల (స) ద్వారా ఈ విషయాన్ని బట్టబయలుగా ప్రకటింపజేసే వాడు. తన తరువాత కూడా ప్రవక్తలు రానున్నారని, వారిని

సయితం నమ్మ వలసి ఉంటుందని తన అనుచర సమాజాన్ని బాగా హెచ్చ రించనిదే ప్రవక్తశ్రీ (స) ప్రపంచం నుండి నిష్క్రమించేవారు కాదు. ఇంతకూ అల్లాహ్‌కు, ఆయన సందేశహరులకు మన ధర్మం, విశ్వాసాల పట్ల శత్రుత్వ మేముందనీ- ప్రవక్తశ్రీ తరువాత దైవదౌత్య ద్వారాలు తెరచుకుని ఉండగా, మరో ప్రవక్త రానుండగా, అతన్ని విశ్వసించనిదే మనం ముస్లిములుగా మనగలగటం సాధ్యం కాకుండగా మనకు దాన్ని గురించి తెలుపకపోవడమే కాక, దానికి భిన్నంగా అల్లాహ్, ఆయన సందేశహరుడు ఉభయులూ సెల విచ్చిన మాటల ప్రకారం పదమూడున్నర వందల ఏళ్ళ తరబడి ముస్లిమ్ సముదాయం యావత్తు ప్రవక్తశ్రీ (స) తరువాత ఏ ప్రవక్తా రాబోవటం లేదని భావిస్తూ వచ్చిందే, నేటికీ అలాగే అనుకుంటూ ఉందే- ఇలా ఎందుకు జరిగింది?

ఇప్పుడు ఒకవేళ పోనీ, దైవదౌత్య ద్వారం తెరచుకునే ఉన్నప్పటికీ, ఎవరయినా ప్రవక్త వచ్చినప్పటికీ మనం ఎటువంటి భయభ్రాంతులకు లోనవకుండా అతన్ని తిరస్కరించి వేస్తాము. ప్రమాదమేదన్నా ఉంటే అల్లాహ్ ప్రశ్నిస్తాడన్నదేగా? ఆయన ప్రళయదినాన మనల్ని ప్రశ్నిస్తే మనం ఈ భోగట్టా అంతా తెచ్చి న్యాయస్థానం ముందుంచుదాం. దీనివల్ల తేలిపోతుంది- ఈ తిరస్కార ప్రమాదంలో మనల్ని పడవేసింది, దైవం మన్నించుగాక, అల్లాహ్ గ్రంథం, ఆయన సందేశహరుని సంప్రదాయాలే అని రుజువయిపోతుంది. ఈ భోగట్టా అంతా చూసిన తరువాత కూడా అల్లాహ్ మనల్ని ఎవరో కొత్త ప్రవక్తను నమ్మలేదన్న నేరానికి శిక్ష విధిస్తాడని మనకు ఎటువంటి సంశయమూ ఉండనక్కరలేదు. కాని ఒకవేళ దైవదౌత్య ద్వారం నిజంగానే మూయబడి ఉన్నట్లయితే, ఏ ప్రవక్తా వచ్చే అవకాశం లేకపోతే, అయినప్పటికీ ఎవరయినా, ఒక దావేదారుని దైవదౌత్యాన్ని విశ్వసించినట్లయితే అతను బాగా ఆలోచించుకోవాలి ఈ తిరస్కారానికి ఒడిగట్టినందుకు శాస్తిగా లభించే శిక్ష నుండి తప్పించుకునేందుకు అతను ఎటువంటి భోగట్టాను దైవ న్యాయ స్థానంలో ప్రవేశపెట్టి తద్వారా విడుదల పొందగలడో, ఆలోచించుకోవాలి. దైవన్యాయస్థానంలో హాజరయ్యే ముందు తన రక్షణకుగాను తాను

సమర్పించే విషయాలన్నీ అతను ఇక్కడే పరిశీలించుకోవాలి. మేము సమర్పించిన విషయాలతో సరిపోల్చి స్వయంగానే చూసుకోవాలి. తాను ఏ రక్షణ సాకుల ఆధారాలను నమ్మి ఈ పనికి ఒడిగడుతున్నాడో వాటిమీద నమ్మకంతో బుద్ధిగలవాడెవడయినా తిరస్కార శిక్ష పొందే ప్రమాదాన్ని కొని తెచ్చుకోగలడా అని?

ఇప్పుడు ప్రవక్త అవసరం ఏముందనీ?

రెండవ పరిశీలనార్హమయిన విషయం, దైవదౌత్యం ఒక గుణం కాదు; ఆరాధన, సత్కార్య సాధనల్లో వృద్ధీ వికాసాలు పొంది తన్ను తాను అర్హునిగా చేసుకున్న ప్రతి వ్యక్తిలో జనించే గుణం కాదు. లేక ఏవయినా సేవలు చేసినందుకుగాను వాటికి ప్రతిగా ప్రసాదించే బహుమానమూ కాదు. ఇదొక పదవీబాధ్యత. దీనిగ్గాను కలిగే ఓ ప్రత్యేకమయిన అవసరం రీత్యా పరమ ప్రభువు అల్లాహ్ ఓ వ్యక్తిని నియమిస్తాడు. ఆ అవసరం ముందుకు వస్తే ఒక ప్రవక్తను దానిగ్గాను నియమించడం జరుగుతుంది. అవసరం లేకపోతే లేక అది తీరిపోతే అనవసరంగా ప్రవక్త తరువాత ప్రవక్తను పంపడమూ జరగదు.

దివ్యఖుర్ఆన్ ద్వారా ఈ విషయం తెలుసుకునేందుకు ప్రయత్నిద్దాము. ప్రవక్తను నియమించే అవసరం ఎటువంటి పరిస్థితుల్లో కలిగిందో చూస్తే అది కేవలం నాలుగు పరిస్థితుల్లో మటుకే ప్రవక్తల్ని ఆవిర్భవింప జేయడం జరుగుతుందని తెలుస్తోంది:

ఒకటి, ఒక ప్రత్యేక జాతిలో ప్రవక్తను పంపే అవసరం కలగటానికి కారణం, ఆ జాతిలో మునుపెన్నడూ ప్రవక్త రాకపోవడం, లేక మరో జాతిలో ప్రభవించిన ప్రవక్త బోధనలు సయితం ఆ జాతి వరకు అందకపోవడం.

రెండు, ప్రవక్తను పంపడానికి కారణం, మునుపు గతించిన ప్రవక్త బోధనలు విస్మరణకు గురవడం, లేక వాటిలో ప్రక్షిప్తాలు జరగడం, ఆ ప్రవక్త అడుగుజాడల్ని అనుసరించడం అసాధ్యమయిపోవడం.

మూడు, మునుపు గతించిన ప్రవక్త ద్వారా పరిపూర్ణమయిన బోధనలు, మార్గనిర్దేశన ప్రజలకు అందకపోవడం, ధర్మపరిపూర్ణతకు అదనపు ప్రవక్తల అవసరం ఏర్పడటం.

నాలుగు, ప్రవక్తతోపాటు అతని సహాయార్థం మరో ప్రవక్త అవసరం కలగటం. ఇప్పుడు వీటిలో ఏ ఆవశ్యకత కూడా ప్రవక్త మహనీయుల (స) తరువాత మిగల్లేదు.

ఖుర్ఆన్ స్వయంగా చెబుతోంది ప్రవక్తశ్రీ(స)ని యావజ్జగత్తు మార్గనిర్దేశనానికి ప్రభవింపజేయబడింది అని. ప్రపంచ నాగరిక చరిత్ర ప్రకారం, ఆయన (స) ఆవిర్భావం సమయాన నిరంతరాయంగా ఎదురయిన పరిస్థితులలో ఆయన (స) సందేశం సకల జాతులకు అందగలిగే అవకాశ ముంది, అన్నివేళలా అందగలిగేందుకు వీలుంది. ఆ తరువాత వేర్వేరు జాతులలో ప్రవక్తలు ప్రభవించే అవసరం ఏదీ మిగల్లేదు.

ప్రవక్తశ్రీ (స) అందజేసిన బోధనలు తమ నిజస్వరూపంలో పూర్తిగా భద్రంగా ఉన్నాయన్న విషయానికి ఖుర్ఆన్ కూడా సాక్షీభూతమయి ఉంది, దానితోపాటు హదీసు, ప్రవక్త చరిత్రకు సంబంధించిన పూర్తి భాండాగారమూ దీనికి సాక్ష్యం పలుకుతోంది. ఇందులో రూపుమాపే క్రియ లేక ప్రక్షిప్తాలు చేర్చే క్రియ ఎంతమాత్రం జరగలేదు. ఆయన (స) తెచ్చిన ఉద్గ్రంథంలో నేటి వరకు ఒక్క అక్షరం కూడా పొల్లుపోకుండా హెచ్చుతగ్గుల్లేకుండా భద్రంగా ఉంది, ప్రళయం వరకు కూడా అది అలాగే ఉంటుంది. తన మాటల ద్వారా చేతల ద్వారా ఆయన బోధించిన విషయాలు దాని పూర్తి నిదర్శనాలు, మనం ఆయన (స) కాలంలోనే జీవిస్తున్నట్లు అనిపించేలా నేటికీ మనకు ప్రాప్తమవు తాయి. అందువల్ల రెండవ ఆవశ్యకత కూడా తీరిపోయింది.

ఇక ప్రవక్తశ్రీ (స) ద్వారా ధర్మం పరిపూర్ణం గావించబడిందని కూడా దివ్య ఖుర్ఆన్ అతిస్పష్టంగా వక్కాణిస్తుంది. కనుక ధర్మ పరిపూర్ణతకు కూడా ఇక ప్రవక్త అవసరం ఏదీ లేదు.

ఇక మిగిలింది నాల్గవ ఆవశ్యకత. దీనికి ఏ ప్రవక్త అయినా అవ సరమయి ఉన్నట్లయితే అది ప్రవక్తశ్రీ (స) కాలంలోనే ఆయనతోపాటు

నియమించబడేవాడు. అప్పుడు నియమించబడకపోతే ఈ కారణం కూడా రద్దయిపోయింది.

ఇక ఆ అయిదవ అవసరం ఏదో, ఆయన (స) తరువాత ఒక ప్రవక్త ఆవశ్యకత ఎందుకు ఏర్పడిందో మనకు తెలియాలి. ఎవరయినా, జాతి చెడిపోయిందని, దాని సంస్కరణకు ఒక ప్రవక్త అవసరమని అంటే మేము అతన్ని ఒకటి అడగదలిచాము, కేవలం సంస్కరణ కొరకు ప్రపంచంలో ప్రవక్త ఎప్పుడు వచ్చాడని నేడు ఇదే పనికిగాను ప్రవక్త రావడానికి? ప్రవక్త నియమించబడేది వహీ పంపడానికి; వహీ ఆవశ్యకత కొత్త సందేశాన్ని అందజేయడానికో లేక గత సందేశాన్ని పరిపూర్ణం గావించడానికో లేదా దాన్ని ప్రక్షిప్తాల నుండి పరిశుద్ధపరచడానికో కలుగుతుంది. ఖుర్ఆన్, ముహమ్మద్ (స) సున్నత్ (సంప్రదాయం) భద్రమయిపోయిన తరువాత, ధర్మం పరిపూర్ణ మయిపోయిన తరువాత, వహీకి సాధ్యమయిన అవసరాలన్నీ తీరిపోయిన తరువాత ఇక సంస్కరణకు కేవలం సంస్కర్తల ఆవశ్యకత మిగిలింది, ప్రవక్తల ఆవశ్యకత కాదు.

కొత్త దైవదౌత్యం ఇప్పుడు ఉమ్మత్ కు కారుణ్యం కాదు అభిశాపం

మూడవ గమనార్హమయిన విషయం ఏమిటంటే, ఒక జాతిలో ప్రవక్త అంటూ ఎప్పుడు వచ్చినా వెంటనే ఆ జాతి ప్రజల్లో విశ్వాసం-తిరస్కారాల ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఆయన్ని విశ్వసించేవారు ఒక సముదాయంగా రూపొందుతారు, ఆయన్ని నమ్మనివారు ఎట్టి పరిస్థితిలోనూ మరో సము దాయంగా పరిగణించబడతారు. ఈ రెండు సముదాయాల భేదాభిప్రాయం కేవలం చిన్న భేదాభిప్రాయం కాదు, ఒక ప్రవక్తను నమ్మడం లేక నమ్మక పోవడం వంటి మౌలికమయిన భేదాభిప్రాయం. వారిలో ఎవరో ఒకరు తమ విశ్వాసాన్ని పరిత్యజించనంతవరకు వారిని సమైక్యమవనివ్వదు. ఆచరణా త్మకంగా కూడా వారి వారి మార్గనిర్దేశన, శాసనాంగాల మూల సాధనాలు

కూడా వేర్వేరయినవే అవుతాయి. ఒక వర్గం తాను స్వీకరించిన ప్రవక్త వహీ, అతని సంప్రదాయాల ద్వారా చట్టాన్ని పరిగ్రహిస్తుంది. మరో వర్గం అవి చట్టానికి మూలసాధనాలన్న విషయాన్నే ఆసాంతం నిరాకరిస్తుంది. ఈ కారణంగా వీరి సమాజం ఉమ్మడి సమాజంగా రూపొందడం ఎట్టి పరిస్థితి లోనూ సాధ్యం కాదు.

ఈ యదార్థాలను ఎవరయినా దృష్టిలో ఉంచుకున్నట్లయితే వారికి ఒక విషయం తేటతెల్లమయిపోతుంది. దైవదౌత్యం ముగింపు ముస్లిమ్ సముదాయానికి దైవం అనుగ్రహించిన ఒక మహాకారుణ్యం. దీని మూలంగానే ఈ సముదాయం ఒక శాశ్వత, విశ్వజనీన సోదరమాలలో ఇమిడిపోతుంది. ఈ విషయం ముస్లిములను ప్రతి మౌలిక విభేదాన్నుంచి కాపాడింది తద్వారా వారిలో శాశ్వత తారతమ్యాలకు కారణంకాగల అంశం ఏదీ ఏర్పడజాలదు. ఇక ఏ వ్యక్తి అయినా మహనీయ ముహమ్మద్ (స)ని తన మార్గదర్శి, నాయకుడుగా నమ్ముతాడో, ఆయన అందజేసిన బోధనలు తప్ప మరిదేన్నీ మార్గబోధనా సాధనంగా ఎంచడానికి అంగీకరించడో అతను ఈ సోదరమాలలో ఒక వ్యక్తిగా ఏ సమయంలోనయినా సరే ఇమిడిపోగలడు. దైవదౌత్య ద్వారం మూయబడకపోయినట్లయితే ఈ సమైక్యతా రూపం ఎన్నటికీ సిద్ధించజాలదు ప్రవక్త వచ్చే ప్రతి సందర్భంలో అది ముక్కచెక్కలయి పోతుంది.

మనిషి కాస్త ఆలోచిస్తే అతని బుద్ధే స్వయంగా చెబుతుంది, ప్రపంచం మొత్తానికిగాను ఒక ప్రవక్తను పంపినప్పుడు, ఆ ప్రవక్త ద్వారా ధర్మం పరిపూర్ణం గావించడమూ జరిగినప్పుడు, ఆ ప్రవక్త బోధనల్ని పూర్తిగా రక్షించడమూ జరిగినప్పుడు దైవదౌత్య ద్వారం మూసివెయ్యవలసిందే. తద్వారా ఆ అంతిమ ప్రవక్త అనుసరణలో ఏకత్రమయి ప్రపంచమంతా శాశ్వతంగా విశ్వాసుల సముదాయం ఒక్కటిగానే రూపొందగలదు. అనవసరంగా సరికొత్త ప్రవక్తల రాకతో ఈ సముదాయంలో మాటిమాటికీ విభేదాలు పొడసూపకుండా ఉంటాయి. ప్రవక్త 'జిల్లి' (ఛాయవంటివాడు) అయినా, 'బురోజీ' (వ్యక్తమయ్యే వాడు) అయినా అనుచర సముదాయంలోని వాడే అయినా, కొత్త షరీఅత్

తీసుకువచ్చినవాడయినా, గ్రంథం తీసుకువచ్చిన వాడయినా, ఇంతకు ప్రవక్త అయిన వ్యక్తి దైవం పంపగా వచ్చినవాడే కాగలడు. అతని రాక వల్ల తప్పనిసరి పరిణామంగా అతన్ని నమ్మేవారు ఒక సముదాయంగా రూపొందగా నమ్మని వారు తిరస్కారులుగా పరిగణించబడతారు. ఈ తారతమ్యం, ప్రవక్తను పంపడం వాస్తవంగా అవసరమయిన స్థితిలోనయితే అనివార్యమయినదే కాని అతని రాక అవసరమే లేకపోయినట్లయితే దేవుని విజ్ఞత, ఆయన కారుణ్యాలకు ఇది పూర్తిగా అసంభవమయిన విషయం. ఆయన అనవసరంగా తన దాసుల్ని విశ్వాసం, తిరస్కారాల సంఘర్షణలో పడ వెయ్యడం గానీ, వారెన్నడూ ఒకే సముదాయంగా రూపొందకుండా చెయ్యడంగాని ఆయన ద్వారా సంభవంకాని విషయం. అందువల్ల ఖుర్ఆన్ ద్వారా రుజువయినదాన్నీ, సున్నత్, సహచరుల ఏకాభిప్రాయం ద్వారా నిరూపితమయిన దాన్నీ బుద్ధి కూడా సరయినదేనని అంగీకరిస్తుంది. దీనంతటి ఆవశ్య కత, తప్పనిసరి పరిణామం ఒక్కటే- ఇక దైవదౌత్య ద్వారం మూసి వేయబడే ఉండాలి.

"మసీహ్ మౌఊద్" వాస్తవికత

కొత్త దైవదౌత్యం వైపునకు పిలిచే పెద్ద మనుషులు సాధారణంగా ఏమీ తెలియని ముస్లిములకు చెబుతారు: హదీసుల్లో "మసీహ్ మౌఊద్" రాకను గురించి సమాచారముందని, 'మసీహ్' ప్రవక్తగనక ఆయన రాక వల్ల "దైవదౌత్యం ముగింపు" భావనలో ఎటువంటి వెలితి ఏర్పడదు. నిజానికి "దైవదౌత్యం ముగింపు" కూడా సత్యమయినదే అయినా "మసీహ్ మౌఊద్" రాక కూడా సత్యమయినదే.

ఈ సందర్భంలో వారు ఇలా కూడా చెబుతారు, "మసీహ్ మౌఊద్" అని అంటే మర్యమ్ సుతుడయిన ఈసా కాదు. ఆయనయితే మరణించారు. ఇప్పుడు హదీసుల్లో రానున్నారని ఉన్న సమాచారం ప్రకారం రానున్నవారు "మసీహ్ రూపాంకితుడు." అంటే హజ్రత్ ఈసా (అ) లాంటి ఒక 'మసీహ్'

అన్నమాట. ఆయనే ఫలానా వ్యక్తి, వచ్చేశాడు కూడా. అతన్ని నమ్మడం దైవదౌత్యం ముగింపునకు వ్యతిరేకమయింది కాదు.

ఈ వంచన తెరదించడానికి ఇక్కడ మేము ప్రామాణికమయిన ఉల్లేఖ నాలను పూర్తి ఆధారాలతో సహా ఉటంకిస్తున్నాము. ఇవన్నీ ఈ విషయా నికి సంబంధించినంతవరకు విశ్వసనీయ హదీసు గ్రంథాలలోనివే. ఈ హదీసుల్ని చూసి ఎవరయినా తెలుసుకోవచ్చు ప్రవక్తశ్రీ (స) సెలవిచ్చిన దేమిటో, దాన్ని నేడు ఏ విధంగా మార్చడం జరుగుతున్నదో.

మర్యమ్ సుతుడు ఈసా(అ) ఆవిర్భావం గురించి హదీసులు

1. హజ్రత్ అబూహురైరా (ర) ఉల్లేఖించారు, దైవసందేశహరులు (స) ఇలా సెలవిచ్చారు, "నా ప్రాణం ఎవరి చేతుల్లో ఉందో ఆ ప్రభువుపై ఒట్టు, **మీ మధ్యన మర్యమ్ సుతులు తప్పక ఆవిర్భవిస్తారు**- ఒక న్యాయశీలుడయిన పాలకునిగా, తరువాత ఆయన శిలువను విరగ్గొడతారు. పందిని సంహరిస్తారు.★ యుద్ధాన్ని అంతమొందిస్తారు. (మరో ఉల్లేఖనంలో 'హర్బ్' (యుద్ధం)కు బదులు 'జిజ్‌యా' అన్న

★శిలువను విరగ్గొట్టడం, పందిని సంహరించడం అంటే భావం క్రైస్తవం ఒక వేరు ధర్మంగా అంతమయిపోతుంది. క్రైస్తవ ధర్మ సౌధం పూర్తిగా ఒక విశ్వాసంపై ఆధారభూతమయి ఉంది. దేవుడు తన అద్వైత కుమారుణ్ణి (అంటే హజ్రత్ ఈసాను) శిలువపైన 'శాప' మృత్యువునిచ్చాడు. దానివల్ల ఆయన మానవుని పాపానికి పరిహారమయ్యారు. ప్రవక్తల అనుచర సమాజాల మధ్య క్రైస్తవుల తమదయిన ప్రత్యేకత ఏమిటంటే వారు కేవలం ఒక్క నమ్మకం ఆధారంగా దైవ శాసనాంగాన్ని మొత్తాన్ని తిరస్కరించారు. కడకు పందిని కూడా ధర్మసమ్మతం చేసుకున్నారు. అది ప్రవక్తలందరి షరీఅత్‌లలో నిషిద్ధమయినది. కనుక హజ్రత్ ఈసా (అ) వచ్చి స్వయంగా, తాను దేవుని కుమారుడుకాదు, తాను శిలువపైన ప్రాణాలూ వదలేదు, తాను ఎవరి పాపాలకూ పరిహారం కాలేదు అని ప్రకటించగానే క్రైస్తవ నమ్మకానికి అసలు ఆధారమే మిగులదు.

పదం ఉంది, అంటే 'జిజ్‌యా'ను అంతమొందిస్తారన్నమాట)★★ ధనం అత్యధికమవుతుంది, దాన్ని స్వీకరించేవాడెవరూ ఉండరు. ఇంకా (పరిస్థితి ఎలా ఉంటుందంటే ప్రజల దృష్టిలో దైవ సన్నిధిలో) ఒక్క సజ్దా చేసుకోవడం ప్రపంచం, అందులోని సమస్తంకన్నా ఉత్తమమయిపోతుంది. (బుఖారి, కితాబ్ అహాదీసుల్ అన్బియా, ఈసా అవతరణ అధ్యాయం; ముస్లిమ్-ఈసా అవతరణ అధ్యాయం; తిర్మిజి ఫితన్ అధ్యాయాలు, ఈసా అవతరణ అధ్యాయం, ముస్నద్ అహ్మద్-అబూహురైరా ఉల్లేఖనాలు)

2. మరో ఉల్లేఖనం హజ్రత్ అబూహురైరా (ర) ద్వారా ఈ పదాలలో ఉంది: "**మర్యమ్ సుతులు ఈసా అవతరించనంతవరకు** ప్రళయం ఏర్పడదు. ....ఆ తరువాత పైన పేర్కొన్న విషయమే ఉంది; (బుఖారి-కితాబుల్ మజాలిమ్, కసరుస్సలీబ్ అధ్యాయం; ఇబ్నుమాజ, కితాబుల్ ఫితన్, ఫిత్నతుద్దజ్జాల్ అధ్యాయం)

3. హజ్రత్ అబుహురైరా (ర) ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు, "ఆనాడు మీ పరిస్థితి ఎలా ఉంటుందో, మీ మధ్యన **మర్యమ్ సుతులు దిగి వస్తారు** మీ ఇమామ్ (నాయకుడు) అప్పుడు మీలోనుంచే ఉంటాడు."★★★ (బుఖారి, కితాబ్ అహాదీసుల్ అన్బియా, నుజూల్ ఈసా గ్రంథం; ముస్లిమ్-నుజూల్ ఈసా విషయం; ముస్నద్ అహ్మద్, అబూహురైరా ఉల్లేఖనాలు)

అలాగే ఆయన తన అనుయాయులకు పందిని ధర్మసమ్మతమూ చేయలేదు, వారిని దైవశాసనాంగం అనుసరణ నుండి స్వేచ్ఛనూ కలిగించలేదు అని తెలిసినప్పుడు క్రైస్తవంలోని రెండవ ప్రత్యేకత కూడా అంతమయిపోతుంది.

★★ మరో మాటలో చెప్పాలంటే దీని భావం, ఆనాడు విభిన్న సముదాయాల భేదాభిప్రాయాలు సమసిపోయి జనులెల్లరూ ఒకే ఇస్లామీయ సముదాయంలో చేరిపోతారు, అలా యుద్ధమూ కాదు, ఒకరికి జిజ్‌యా విధించబడదు. దీన్నే ముమ్మందు హదీసు నెం.5, 15 కూడా ధృవీకరిస్తున్నాయి.

★★★ అంటే నమాజ్‌లో హజ్రత్ ఈసా (అ) ఇమామత్ చెయ్యరు. అప్పట్లో ఎవరు ముస్లిముల నాయకుడై ఉంటారో అతని వెనకే ఆయన నమాజ్ చేస్తారు.

4. హజ్రత్ అబూహురైరా(ర) ఉల్లేఖించారు: దైవసందేశహరులు (స) ఇలా సెలవిచ్చారు, "**మర్యమ్ కుమారుడు ఈసా ఆవిర్భవిస్తారు.** అప్పుడు ఆయన పందిని సంహరిస్తారు. శిలువను రూపుమాపుతారు. ఆయన కోసం నమాజ్ సమావేశం ఏర్పరచబడుతుంది. ఆయన ఎంతగా ధనం పంచి పెడతారంటే దాన్ని స్వీకరించేవాడే ఉండడు. ఆయన పన్నును రద్దు పరుస్తారు. రౌహా★ ప్రాంతంలో మజిలీ చేసి హజ్జ్ లేక ఉమరా చేస్తారు లేక రెండూ ఒకేసారి ఆచరిస్తారు.★★ ప్రవక్తశ్రీ(స) ఇందులో ఏ మాట పలికారో ఉల్లేఖన కర్తకు అనుమానంగా ఉంది. (ముస్నద్ అహ్మద్ - అబూహురైరా ఉల్లేఖనాలు; ముస్లిమ్ కితాబుల్ హజ్జ్, జవాజుత్తమత్తు' ఫిల్‌హజ్జ్ వల్‌కిరాన్ అధ్యాయం).

5. హజ్రత్ అబూహురైరా (ర) ఉల్లేఖనం ప్రకారం (దజ్జాల్ బయటపడటం ప్రస్తావించిన తరువాత ప్రవక్తశ్రీ(స) ఇలా నుడివారు): "ముస్లిములు వాడి (దజ్జాల్)తో పోరాడటానికి సన్నద్ధులవుతున్న తరుణంలో బారులుతీరుతూ ఉండగా, నమాజ్ కొరకు తక్బీర్ చెప్పిన తరువాత **మర్యమ్ సుతుడు ఈసా (అ) అవతరిస్తారు,** నమాజ్‌లో ముస్లిములకు ఇమామత్ (నాయకత్వం) వహిస్తారు. దేవుని శత్రువు (దజ్జాల్) ఆయన్ని చూడగానే నీటిలో ఉప్పు కరిగేలా కరగటం మొదలవుతాడు. ఈసా (అ) అతన్ని అదే స్థితిలో వదలిపెట్టినట్లయితే అతను తానే కరిగి పోయి చచ్చిపోతాడు. కాని అల్లాహ్ వాడిని ఆయన చేత సంహరింపజేస్తాడు, ఆయన తన బల్లెనికి తగిలిన అతని రక్తం ముస్లిములకు చూపిస్తారు." (మిష్కాత్: కితాబుల్ ఫితన్, అలామలాహిమ్ అధ్యాయం, ముస్లిమ్ ఆధారంగా)

★ మదీనాకు 35 మైళ్ళ దూరాన ఉన్న ఒక స్థలం.

★★ ఒక విషయం విశదమవడం అవసరం. ఈ కాలంలో ఏ పెద్ద మనిషిని క్రీస్తువంటివాడు (మసీలె మసీహ్) అని అంటున్నారో ఆయన తన జీవిత కాలంలో హజ్జ్ కూడా చేయలేదు, ఉమ్రా చేయలేదు!

6. అబూహురైరా (ర) ఉల్లేఖనం. ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు: నాకూ ఆయనకు (అంటే ఈసా(అ)-కు) మధ్యన ప్రవక్త ఎవ్వరూ లేరు. మరేమో **ఆయన దిగిరానున్నారు.** మీరు ఆయన్ని చూడగానే గుర్తుపట్టండి. ఆయన మధ్యస్థ ఎత్తుగల వ్యక్తి, రంగు ఎరుపు, తెలుపు కలిసి ఉంటుంది. రెండు పసుపు పచ్చని బట్టలు తొడిగి ఉంటారు. ఆయన తల వెంట్రుకలు ఇప్పుడే నీటి బొట్లు రాలుతాయా అన్నట్లు ఉంటాయి, ఇంతకు అవి తడిసి ఉండవు. ఆయన ఇస్లామ్ కొరకు జనంతో పోరు సలుపుతారు. శిలువను పిండిపిండి చేసివేస్తారు. పందిని సంహరిస్తారు. జిజ్యా అంత మొందిస్తారు. ఆయన కాలంలో అల్లాహ్ ఇస్లామ్ తప్ప సమస్త సముదాయాలను రూపుమాపుతాడు. ఆయన దజ్జాల్ మసీహ్‌ని సంహరిస్తారు. ఆయన భువిలో నలభయి ఏళ్ళు గడుపుతారు. తరువాత ఆయన పరమపదిస్తారు. ముస్లిములు ఆయన జనాజా నమాజ్ చేస్తారు. (అబూదావూద్-కితాబుల్ మలాహిమ్, ఖురూజు ద్దజ్జాల్ అధ్యాయం; ముస్నద్ అహ్మద్- అబూహురైరా ఉల్లేఖనాలు)

7. తాను ప్రవక్త మహనీయులు (స) చెబుతూ ఉండగా విన్నట్లు హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (ర) అన్నారు: "....తరువాత **మర్యమ్ సుతుడు ఈసా అవతరిస్తారు.** ముస్లిముల నాయకుడు ఆయనకు రండి, మీరు నమాజ్ చేయించండి అని కోరుతారు. కాని ఆయన, కాదు మీరే స్వయంగా ఒండొకరికి నాయకులు* అని అంటారు. ఆయన (అ) ఈ అనుచర సమాజానికి దైవం ప్రసాదించిన గౌరవ పురస్కారంగా ఇలా అంటారు." (ముస్లిమ్- ఈసా, మర్యమ్ సుతుని అవతరణా ప్రస్తావన; ముస్నద్ అహ్మద్: జాబిర్ బిన్ అబ్దుల్లా (ర) ఉల్లేఖనాలు).

8. జాబిర్ బిన్ అబ్దుల్లా (ఇబ్ను సయ్యాద్ గాధ సందర్భంలో) ఉల్లేఖించారు, "తరువాత ఉమర్ బిన్ ఖత్తాబ్ ఇలా విన్నవించుకున్నారు, దైవప్రవక్తా నాకు అనుమతినివ్వండి, నేను అతన్ని సంహరిస్తాను

★ అంటే మీ నాయకుడు మీలోనివాడే కావాలి.

అని. దానికి ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు, "ఇతను ఆ వ్యక్తే (దజ్జాల్) అయినట్లయితే ఇతన్ని సంహరించేవాడు నీవు కాదు, ఇతన్ని **మర్యమ్ సుతుడు ఈసా మాత్రమే సంహరిస్తారు.** ఒకవేళ ఈ వ్యక్తి అతను కాకపోయినట్లయితే నీకు ఒడంబడికదారు (జిమ్మీ)లలోని ఒక వ్యక్తిని సంహరించే హక్కు ఏదీ లేదు." (మిష్కాత్: కితాబుల్ ఫితన్- ఇబ్నుసయ్యాద్ గాథ అధ్యాయం, షరహుస్సున్న-బగవీ ఆధారంగా).

9. జాబిర్ బిన్ అబ్దుల్లా ఉల్లేఖనం ప్రకారం (దజ్జాల్ గాథ చెబుతూ ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు): "అప్పుడు అకస్మాత్తుగా మర్యమ్ కుమారుడు ఈసా (అ) ముస్లిముల మధ్యన వచ్చేస్తారు. తరువాత నమాజ్ కోసం నిలబడతారు. అప్పుడు ఆయన్ని సంబోధించి **"రూహుల్లా,** ముందుకు రండి, అని అంటారు. కాని ఆయన, కాదు మీ ఇమామ్ ముందుకు రావలసి ఉంది, ఆయనే నమాజ్ చేయించాలి అని అంటారు. తరువాత ఉదయపు నమాజ్ ముగించుకుని ముస్లిములు దజ్జాల్‌ని ఎదుర్కొనేందుకు బయలు దేరుతారు." ఆయన ఇంకా ఇలా అన్నారు, "ఆ అబద్ధాలకోరు హజ్రత్ ఈసా (అ)ని చూడగానే నీటిలో ఉప్పు కరిగేలా కరగసాగుతాడు. అప్పుడు ఆయన అతని వైపునకు ముందడుగు వేస్తారు, అతన్ని సంహరిస్తారు. అప్పటి పరిస్థితి ఎలా ఉంటుందంటే చెట్లూ రాళ్ళు కూడా ఎలుగెత్తిచాటుతాయి "రూహుల్లా ఈ యూదుడు నా వెనక దాగి ఉన్నాడు" అని. దజ్జాల్ అనుయాయుల్లో ఏ ఒక్కడూ మిగులడు ఆయన (ఈసా-అ) సంహరించనివాడే ఉండడు. (ముస్నద్ అహ్మద్, జాబిర్ బిన్ అబ్దుల్లా ఉల్లేఖనాలు).

10. హజ్రత్ నవ్వాస్ బిన్ సమ్‌న్ కలాబి (దజ్జాల్ గాథ వినిపిస్తూ) ఉల్లేఖిస్తున్నారు: దజ్జాల్ ఇలా చేస్తూ ఉండగా పరమప్రభువు **మర్యమ్ సుతుడు మసీహ్‌ని** పంపుతాడు. ఆయన **డెమాస్కస్ తూర్పు భాగాన తెల్లని**

గోపురం వద్ద, పసుపు పచ్చని రెండు బట్టలలో ఇద్దరు దైవదూతల భుజాలపైన తన చేతులు ఆనించి దిగుతారు. ఆయన తల వంచినప్పుడు బొట్లురాలుతాయా అనిపిస్తుంది, ఆయన తలెత్తగానే ముత్యాలు రాలుతూ ఉన్నట్లు కనిపిస్తుంది. ఆయన శ్వాసగాలి ఏ తిరస్కారికిసోకినా -అది ఆయన చూపుమేరకూ చేరుతుంది- అతను బ్రతికిబట్టకట్టలేడు. తరువాత మర్యమ్ కుమారుడు దజ్జాల్‌ని వెంటాడుతారు. వాడిని లుద్ద్★ ద్వారానపోయి పట్టుకుంటారు, అతన్ని సంహరిస్తారు.

11. దైవసందేశహరులు సెలవిచ్చినట్లు అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ అంటున్నారు: "దజ్జాల్ నా సముదాయంలో బయలుదేరుతాడు. నలభయి (నాకు గుర్తులేదు, నలభయి దినాలో, నలభయి నెలలో, నలభయి సంవత్సరాలో★★) జీవిస్తాడు. తరువాత అల్లాహ్ మర్యమ్ **కుమారుడు** ఈసాను పంపుతాడు. ఆయన రూపురేఖలు "ఉర్వాబిన్ మస్ఊద్" (ఒక సహ చరులు)ను పోలి ఉంటాయి. ఆయన వాడిని వెంటాడుతారు. వాడిని సంహరిస్తారు. తరువాత జనులు ఏడేళ్ళ వరకు, ఏ ఇద్దరు వ్యక్తుల మధ్యనూ వైషమ్యం లేని స్థితిలో జీవిస్తారు. (ముస్లిమ్: జిక్రుద్దజ్జాల్)

12. హుజైఫా బిన్ ఉసీద్ అల్ గిఫారీ ఉల్లేఖనం: ఒకసారి ప్రవక్త మహనీయులు (స) మా సమావేశంలోకి వచ్చారు. అప్పుడు మాలో మేము మాటలాడుకుంటున్నాము. 'ఏమిటీ మాటలాడుకుంటు న్నారు' అడిగారాయన. 'మేము ప్రళయం గురించి ప్రస్తావించు

★లుద్ద్ (Lydda) అనే పట్టణం పాలస్తీనాలో ఇస్రాయీల్ రాజ్య రాజధాని తల్ అబీబ్ (Telaviv)కు కొన్ని మైళ్ళ దూరాన ఉంది. యూదులు అక్కడ పెద్ద విమానాశ్రయం నిర్మించి పెట్టారు.

★★ ఇది హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ చెప్పిన మాట.

కుంటున్నాము' అని చెప్పారు అక్కడున్నవారు. 'అది, పది చిహ్నాలు బయల్పడనంత వరకు ముమ్మాటికీ నెలకొనదు.' అంటూ ఆయన ఆ పది గుర్తులు తెలిపారు: (1) పొగ (2) దజ్జాల్ (3) దాబ్బతుల్ అర్జ్ (జంతువు) (4) సూర్యుడు పశ్చిమాన ఉదయించడం (5) మర్యమ్ కుమారులు ఈసా అవతరణ (6) యాజూజ్, మాజూజ్ (7) మూడు మహా భూధ్వంసాలు*- ఒకటి తూర్పున (8) రెండవది పశ్చిమాన (9) మూడవది అరేబియా ద్వీపకల్పంలో (10) చివరన మహా అగ్ని, అది యమన్ నుండి లేచి జనుల్ని తోలుకుని పునరుత్థాన మైదానం వైపునకు తీసుకుపోతుంది. (ముస్లిమ్: కితాబుల్ ఫితన్, వ అష్రా తుస్సాఅ; అబూదావూద్: కితాబుల్ మలాహిమ్, ఇమారా తుస్సాఅ అధ్యాయం.)

13. ప్రవక్త మహనీయులు స్వేచ్ఛ కల్పించిన బానిస సౌబాన్ ఉల్లేఖనం ప్రకారం ప్రవక్తశ్రీ (స) ఇలా సెలవిచ్చారు: నా అనుచర సముదాయంలో రెండు సేనల్ని అల్లాహ్ నరకాగ్ని నుండి రక్షించాడు. ఒకటి హిందూదేశం మీద దాడి జరిపినదాన్ని, రెండు, **మర్యమ్ సుతుడు ఈసాను** తోడుగా ఉండేదాన్ని." (నసాయి: కితాబుల్ జిహాద్, ముస్నద్ అహ్మద్: సౌబాన్ ఉల్లేఖనాలు)

14. ముజమ్మి'బిన్ జారియ అన్సారి ప్రకారం, "నేను దైవసందేశ హరులు (స) చెప్పగా విన్నాను, **మర్యమ్ సుతులు (అ)** దజ్జాల్‌ని 'లుద్ద్' ద్వారాన సంహరిస్తారు." (ముస్నద్ అహ్మద్, తిర్మిజి: అబ్వాబుల్ ఫితన్)

15. అబూ ఉమామ బాహిలి (ఒక సుదీర్ఘ హదీసులో దజ్జాల్ ప్రస్తావన చేస్తూ) ఉల్లేఖించారు: "సరిగ్గా ముస్లిముల ఇమామ్ ఉదయపు నమాజ్ చేయించడానికి ముందుకు అడుగువేసినప్పుడు **మర్యమ్**

★ నేల కూరుకుపోవడం (Land Slide).

సుతుడు ఈసా (అ) వారి మధ్యన దిగి వస్తారు. ఇమామ్ వెనక్కి మరలుతాడు, ఈసా (అ) ముందుకు రావాలని. కాని ఈసా (అ) అతని భుజాల మధ్య చెయ్యిపెట్టి, కాదు నీవే నమాజ్ చేయించు, ఎందుకంటే ఇది (జమాఅత్) నీ కోసమే నిలబడింది. తదనుగుణంగా అతనే నమాజ్ చేయిస్తాడు. సలామ్ పలికిన తరువాత ఈసా (అ) తలుపు తెరవమని అంటారు. అది తెరుస్తారు. బయట దజ్జాల్ 70 వేల మంది సాయుధ యూదులతో పాటు నిలబడి ఉంటాడు. ఈసా (అ) దృష్టి అతనిపై పడగానే అతను కరగనారంభిస్తాడు, నీటిలో ఉప్పు కరిగేలా; తరువాత అతడు పారిపోతాడు. ఈసా (అ), నా వద్ద నీ కొరకు ఒక దెబ్బ ఉంది దాన్నుండి నీవు తప్పించుకోలేవు అని అంటారు. తరువాత ఆయన వాడిని లుద్ద్ తూర్పు ద్వారం వద్ద పట్టుకుంటారు అప్పుడు అల్లాహ్ యూదుల్ని పరాజితులు చేస్తాడు... నేల ముస్లిములతో నిండిపోతుంది- పాత్ర నీటితో నిండిపోయినట్లు. సమస్త ప్రపంచం విశ్వాస వచనం ఒకటే అవుతుంది, పరమ ప్రభువు అల్లాహ్ ఆరాధన తప్ప మరెవరి ఆరాధనా జరగదు. (ఇబ్నుమాజ: కితాబుల్ ఫితన్, ఫితనతుద్దజ్జాల్ అధ్యాయం)

16. ఉస్మాన్ బిన్ అబిల్ ఆస్, నేను దైవసందేశహరులు(స) ఇలా సెలవియ్యగా విన్నాను అని చెప్పారు: "..... ఇంకా **మర్యమ్ కుమారుడు ఈసా ఉదయపు నమాజ్ వేళన దిగివస్తారు.** ముస్లిముల నాయకుడు ఆయన్ని సంబోధించి, '**రూహల్లా** మీరు నమాజ్ చేయించండి' అని అంటాడు. ఆయన ఇలా సమాధానమిస్తారు, 'ఈ ఉమ్మత్ ప్రజలు స్వయంగానే ఒకరికొకరు నాయకులు.' ఆ మీదట ముస్లిముల నాయకుడు ముందుకు సాగి నమాజ్ చేయిస్తాడు. నమాజ్ ముగిసిన తరువాత ఈసా (అ) తన ఆయుధం తీసుకుని దజ్జాల్ వైపునకు బయలుదేరుతారు. వాడు ఆయన్ని చూడగానే సీసం కరిగినట్లు

కరగడం మొదలెడతాడు. ఈసా (అ)తన ఆయుధంతో అతన్ని సంహరిస్తారు. అతని సహచరులు పరాజితులయి పారిపోతారు. కాని వారు దాక్కునేందుకు చోటంటూ దొరకదు. కడకు, చెట్లు సయితం ఎలుగెత్తి చాటుతాయి, 'విశ్వాసీ! ఈ తిరస్కారి ఇక్కడున్నాడు అని'. రాళ్ళూ ఎలుగెత్తి పలుకుతాయి 'విశ్వాసీ! ఈ తిరస్కారి ఇదో ఇక్కడ ఉన్నాడు" అని. (ముస్నద్ అహ్మద్: తబ్రాని, హాకిమ్)

17. సముర బిన్ జున్దుబ్ (ఒక సుదీర్ఘ హదీసులో) ప్రవక్త మహనీయుల (స) ద్వారా ఉల్లేఖిస్తున్నారు; "ఆ తరువాత ఉదయంపూట ముస్లిముల మధ్య **మర్యమ్ సుతుడు ఈసా (అ)** వస్తారు. దజ్జాల్, వాడి సైన్యాలకు అల్లాహ్ ఓటమి పాల్జేస్తాడు. కడకు గోడలు, చెట్లవేర్లూ ఎలుగెత్తి పలుకుతాయి, 'విశ్వాసీ, నా వెనక ఇదో ఈ తిరస్కారి దాక్కుని ఉన్నాడు, రా, వచ్చి ఇతన్ని సంహరించు" అంటాయి. (ముస్నద్ అహ్మద్, హాకిమ్)

18. ఇమ్రాన్ బిన్ హిసీన్ ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు: నా అనుచర సముదాయంలో సదా ఒక వర్గం ప్రజలు ఉంటారు. వారు సత్యాన్ని స్థిరంగా పట్టుకుని నిలబడతారు, విరోధులపై ఆధిక్యత గలవారుగా ఉంటారు, చివరికి పరమ ప్రభువు నిర్ణయం వచ్చేస్తుంది. **మర్యమ్ కుమారుడు ఈసా (అ) అవతరిస్తారు.** (ముస్నద్ అహ్మద్)

19. (దజ్జాల్ గాథలో) హజ్రత్ ఆయిషా ఉల్లేఖించారు: "...తరువాత **ఈసా (అ) అవతరిస్తారు**, దజ్జాల్‌ని సంహరిస్తారు, ఆ తరువాత ఈసా (అ) నలభయ్యేళ్ళ వరకు ధరణిపై ఒక న్యాయవంతమయిన నాయకునిగా న్యాయశీలుడయిన పాలకునిగా ఉంటారు." (ముస్నద్ అహ్మద్)

20. దైవసందేశహరులు స్వేచ్ఛనొసగిన బానిస సఫీనా (దజ్జాల్ గాథలో)

ఇలా ఉల్లేఖించారు: **తరువాత ఈసా (అ) అవతరిస్తారు**, అల్లాహ్ దజ్జాల్‌ని అఫీక్* మలుపునకు దగ్గర సంహరిస్తాడు. (ముస్నద్ అహ్మద్)

21. హజ్రత్ హుజైఫా బిన్ యమాన్ (దజ్జాల్ ప్రస్తావనతో) ఇలా వివరించారు: "....తరువాత ముస్లిములు నమాజ్‌కుగాను నిలబడి ఉండగా వారి కళ్ళ ఎదుట **మర్యమ్ కుమారుడు ఈసా దిగివస్తారు. ఆయన ముస్లిములకు నమాజ్ చేయిస్తారు.** సలామ్ పలికిన తరువాత జనులను సంబోధించి, నాకూ ఆ దైవ శత్రువుకు మధ్య నుండి తొలిగిపోండి అని అంటారు..... మరి అల్లాహ్, దజ్జాల్ అనుయాయుల పైన ముస్లిములకు ఆధిక్యతనిస్తాడు. ముస్లిములు వారిని బాగా దెబ్బతీస్తారు. కడకు చెట్లు ఎలుగెత్తి చాటుతాయి, అబ్దుల్లా, అబ్దుర్రహ్మాన్, ముస్లిములారా, ఇదో ఒక యూదుడు, ఇతన్ని కొట్టండి, ఈ విధంగా అల్లాహ్ వారిని నాశనం చేస్తాడు. ముస్లిములు ఆధిపత్యం వహిస్తారు, శిలువను విరగ్గొడతారు, పందిని సంహరిస్తారు, జిజ్‌యాని రద్దు పరుస్తారు." (ముస్తదరక్ హాకిమ్, ముస్లిమ్‌లోనూ ఈ ఉల్లేఖనం సంక్లుప్తంగా వచ్చింది. హాఫిజ్ ఇబ్నుహజ్ర్ ఫత్‌హుల్‌బారి సం.6, పు.450లో దీన్ని ప్రామాణిక మయిందని నిర్ణయించారు.)

ఇవి మొత్తం 21 ఉల్లేఖనాలు. 14 మంది సహచరుల సరయిన ప్రమాణాలతో హదీసుకు సంబంధించిన విశ్వసనీయ గ్రంథాలలో వచ్చాయి. ఇవికాక వేరే అనేక హదీసుల్లోనూ ఈ ప్రస్తావన వచ్చి ఉన్నప్పటికీ చర్చను మరీ పొడిగించడాన్ని తప్పించి మేము వాటినన్నింటినీ ఉటంకించలేదు. ప్రమాణం రీత్యా బలమయిన ఉల్లేఖనాలనే తీసుకున్నాము.

---

*'అఫీక్'నే నేడు 'ఫీక్' అని అంటున్నారు. సిరియా ఇస్రాయీల్ సరిహద్దుపైన ప్రస్తుత సిరియా రాజ్యంలో చివరి నగరం. దానిపైన పడమటి దిశలో కొన్ని మైళ్ళ దూరాన 'తబరియ్యా' పేరుగల సరస్సు ఒకటుంది. అందులోనుంచే జోర్డాన్ నది వెడలుతుంది. దాని నైరుతి దిశలో కొండల మధ్య ఒక దిగుడుదారి ఉంది అది దాదాపు వెయ్యిన్నర రెండువేల అడుగుల లోతున దిగిన తరువాత జోర్డాన్ నది 'తబరియ్యా' నుండి వెలువడే చోటికి చేరుతుంది. ఆ కొండ దారినే 'అకబ అఫీక్' (అఫీక్ కనుమ) అని అంటారు.

ఈ హదీసుల వల్ల రుజువయ్యేదేమిటీ?

ఈ హదీసులను ఎవరు చదివినా వీటిలో 'మసీహ్ మౌఊద్' లేక 'మసీహ్ రూపాంకితుడు' లేక 'మసీహ్ అభివ్యక్తి'కి సంబంధించిన ప్రస్తావన ఏదీ లేదు అన్నది స్వయంగా చూసుకోవచ్చు. వీటి ప్రకారం, నేడు ఎవరయినా ఒక తల్లి కడుపున, తండ్రి బిందువు ద్వారా పుట్టి నేనే ఆ మసీహ్‌ని, నా రాకను గురించే నాయకశ్రేష్ఠులు మహనీయ ముహమ్మద్ (స) భవిష్యవాణి చెప్పారు అని వాదించేందుకు ఎటువంటి అవకాశమూ లేదు. ఈ హదీసులన్నీ స్పష్టంగా ప్రస్ఫుటమయిన పదాలలో, నేటికి రెండువేల సంవత్సరాలకు పూర్వం తండ్రి లేకనే హజ్రత్ మర్యమ్ (అ) కడుపున పుట్టిన హజ్రత్ ఈసా (అ) అవతరణను గురించి సమాచారాన్ని అందజేస్తున్నాయి. ఈ సందర్భంలో ఆయన మరణించారా లేక ఎక్కడయినా సజీవంగా ఉన్నారా అన్న చర్చ అసంబద్ధమయినది. ఆయన మరణించి ఉన్నా అల్లాహ్ ఆయన్ని బ్రతికించి తీసుకు వచ్చేందుకు సమర్థుడే. అలాకాక ఆయన తన దాసుడు ఒకడిని తన విశ్వంలో ఎక్కడయినా వేలాది సంవత్సరాలు సజీవంగా ఉంచి తాను కోరినప్పుడు ప్రపంచంలో తిరిగి తీసుకువెళ్ళగలగడం కూడా ఆయన వల్ల అసంభవమేమీకాదు. ఇంతకు ఒక వ్యక్తి హదీసులను అంగీకరించే మాటయితే, రానున్నవారు ఆ మర్యమ్ కుమారులయిన ఈసా అలైహిస్సలామే నని ఒప్పుకోక తప్పదు. ఆయన పుట్టడు, అవతరిస్తాడు.

ఈ హదీసుల ద్వారా ఇంతే విశదంగా వ్యక్తమయ్యే మరో విషయం ఏమిటంటే, మర్యమ్ కుమారుడు హజ్రత్ ఈసా (అ) రెండవసారి ఇలా అవతరించడం కొత్తగా ప్రవక్తగా నియుక్తుడయి వచ్చే వ్యక్తిలా కాదు. ఆయనకు వహీ అవతరించదు, ఆయన దైవం తరపున ఏ కొత్త సందేశమూ లేక కొత్త ఆదేశాలూ అందజేయరు. ఆయన ముహమ్మదీయ షరీఅత్‌లో ఎటువంటి హెచ్చుతగ్గులూ చెయ్యరు. ఆయన ధర్మపునరుజ్జీవనానికీ ప్రపంచంలోకి తీసుకురావడము జరగడం లేదు. ఆయన వచ్చి, జనుల్ని తనను విశ్వసించ వలసిందిగా పిలుపునివ్వడమూ జరగదు. ఆయన తన్ను నమ్మే వారిని వేరుగా

ఒక అనుచర సమూజంగానూ రూపొందించరు. ఆయన కేవలం ఒక ప్రత్యేక కార్యసిద్ధి కోసం పంపబడతారు, ఆయన దజ్జాల్ ఫిత్నాను నిర్మూలించడానికి వస్తారు.

ఈ ఉద్దేశంతో ఆయన దిగి వచ్చే విధానం వల్లా ఏ ముస్లిముల మధ్య ఆయన అవతరిస్తారో వారికి, ఆయనే మర్యమ్ కుమారుడు ఈసా అన్న విషయంలో ఎటువంటి సందేహమూ జనించదు. దైవసందేశ హరుల (స) భవిష్యవాణి కనుగుణంగా సరయిన సమయానికే ఆయన వచ్చారని వారు అనుకుంటారు. ఆయన వచ్చి ముస్లిముల సమాజంలో కలసిపోతారు. ఆనాడు ఏ వ్యక్తి అయితే ముస్లిముల నాయకుడయి ఉంటాడో అతని వెనకే నమాజ్ చేస్తారు.* ఆనాడు ఎవరయితే ముస్లిముల నాయకుడయి ఉంటాడో అతన్నే మున్ముందుంచుతారు. తాను మునుపటి దైవదూత స్థానంలో, నేడు దైవదౌత్య బాధ్యతల నిర్వర్తనకు తిరిగి వచ్చినట్లు ఏవయినా అనుమానాలు పుట్టే మాటయితే వాటికి ఏమాత్రం అవకాశం లేకుండా ఉండటానికి. ఒక సముదాయంలో దైవసందేశహరుడు ఉన్నప్పుడు దానికి మరొక ఇమామ్‌గాని మరో వ్యక్తి నాయకుడుగాని కాలేడన్నది సుస్పష్టమయిన విషయం. కనుక ఆయన ముస్లిముల సముదాయంలోకి వచ్చి కేవలం ఒక వ్యక్తిలా అందులో చేరిపోవడమే ఆయన దైవదూత స్థాయిలో విచ్చేయలేదు అన్న విషయాన్ని దానంతట అదే చాటుతోంది. అందువల్ల ఆయన రాక వల్ల దైవదౌత్య సీలు ముద్ర భంగపడే ప్రశ్న అసలే తలెత్తదు.

ఆయన రాక ఒక రాష్ట్రపతి కాలంలో మాజీ రాష్ట్రపతి ఎవరయినా వచ్చినటువంటిది, ఇంకా ఆనాటి రాష్ట్రపతి విధేయతలో దేశానికి ఏదయినా

★ రెండు ఉల్లేఖనాల (నెం.5, 21)లో హజ్రత్ ఈసా (అ) అవతరించిన తరువాత తొలి నమాజ్ స్వయంగా చేస్తారని ఉన్నప్పటికీ అత్యధిక, బలమయిన ఉల్లేఖనాల్లో (నెం.3,7,9,15,16)ఆయన ఇమామత్ చెయ్య డానికి నిరాకరిస్తారని ఆనాటి ఇమామ్‌నే ముందుకు సాగనిస్తారని ఉంది. ఈ విషయాన్నే హదీసువేత్తలు, వ్యాఖ్యాతలు ఏకగ్రీవంగా అంగీకరించారు.

సేవ అందజేసేటటు వంటిది. ఒక సాధారణ బుద్ధిగల వ్యక్తి కూడా ఒక అధ్యక్షుని కాలంలో ఎవరయినా మాజీ అధ్యక్షుడు వచ్చినంత మాత్రాన రాజ్యాంగం భంగపడటం అన్నది జరగదనే విషయాన్ని అంగీకరిస్తాడు. అయితే రెండు సందర్భాలలో రాజ్యాంగం భంగపడటం అన్నది తప్పనిసరిగా సంభవిస్తుంది. ఒకటి, మాజీ అధ్యక్షుడు వచ్చి తిరిగి అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించడానికి ప్రయత్నించినప్పుడు; రెండు, ఎవరయినా అతని మాజీ అధ్యక్ష స్థాయినీ నిరాకరించినప్పుడు. మాజీ అధ్యక్ష స్థాయిని కాదంటే ఆయన అధ్యక్షతా కాలంలో నిర్వహించబడిన కార్యాలన్నింటి ధర్మబద్ధతను నిరాకరించడంతో సమానం. ఈ రెండు పరిస్థితుల్లో ఏదీ లేకపోతే మాజీ రాష్ట్రపతి రాక స్వయాన రాజ్యాంగ స్థానంలో ఎటువంటి మార్పు చేయ జాలదు. ఇదే వ్యవహారం హజ్రత్ ఈసా (అ) రెండవ రాకకు సంబంధించినది కూడా. కేవలం ఆయన రావడంతోటే దైవదౌత్యం ముగింపు భంగపడదు. అయితే ఆయన వచ్చి తిరిగి దైవదౌత్యపదవీ బాధ్యతలు చేపట్టినట్లయితే, దైవదౌత్య కార్యక్రమాలు నిర్వర్తించడం మొదలు పెట్టినట్లయితే లేక ఎవరయినా ఆయన మాజీ దైవదౌత్యాన్ని కూడా నిరాకరించినట్లయితే దీనివల్ల అల్లాహ్ దైవదౌత్య నియమావళి తప్పనిసరిగా భంగపడుతుంది. హదీసులు పూర్తి వివరంగా రెండు పరిస్థితుల దారులూ మూసివేశాయి. ఒక వైపున అవి, మహనీయ ముహమ్మద్ (స) తరువాత మరో దైవదౌత్యం లేదని చాటుతున్నాయి. మరో వైపున మర్యమ్ కుమారుడు ఈసా (అ) తిరిగి అవతరిస్తారని ప్రకటిస్తున్నాయి. దీన్నిబట్టి స్పష్టంగా తేలిపోతుంది, ఆయన ఈ రెండవ రాక దైవదౌత్య పదవీ బాధ్యతల నిర్వహణకు కాదన్న విషయం.


ఇదే విధంగా ఆయన రాక వల్ల ముస్లిముల మధ్య విశ్వాసం తిరస్కారాల కొత్త ప్రశ్న కూడా ఉత్పన్నం కాదు. ఆయన మాజీ దైవదౌత్యాన్ని ఎవరయినా నేడు కూడా విశ్వసించకపోతే తిరస్కారి అయిపోతాడు. మహనీయ ముహమ్మద్ (స) స్వయంగా ఆయన దైవదౌత్యాన్ని విశ్వసించేవారు. ఆయన (స) అనుచర సముదాయం తొలి నుంచీ ఈయన్ని నమ్ముతోంది. ఇదే స్థితి

ఆయన తిరిగి వచ్చిన నాడు కూడా ఉంటుంది. ముస్లిములు ఏదో కొత్త దైవదౌత్యాన్ని నమ్మవలసి ఉండదు. మర్యమ్ కుమారుడు ఈసా (అ) దైవదౌత్యాన్ని నేడు విశ్వసిస్తున్నట్లే ఆనాడూ విశ్వసిస్తారు. ఈ విషయం నేడూ దైవదౌత్యం ముగింపునకు భంగం కలిగించదు, నాడూ కలిగించదు.

చివరి విషయం, ఈ హదీసుల ద్వారానూ ఇంకా అనేక ఇతర హదీసుల ద్వారానూ తెలిసేదేమిటంటే, దజ్జాల్ మహోపద్రవాన్ని నిర్మూలించ డానికి మర్యమ్ కుమారుడు హజ్రత్ ఈసా (అ)ను పంపడం జరుగుతోంది. వాడు యూదులలోనివాడయి ఉంటాడు, తన్ను తాను 'మసీహ్'గా పేర్కొంటాడు. ఈ వ్యవహారంలోని వాస్తవికతను అర్థం చేసుకోవాలంటే యూదుల చరిత్ర, వారి మతభావనలు తెలుసుకుని ఉండాలి. హజ్రత్ సులైమాన్ (అ) మరణానంతరం బనీ ఇస్రాయీల్ ఎడతెగకుండా పతనావస్థకు లోనవుతూ ఉన్న స్థితిలో, చివరికి బాబిలోనియా, అసీరియా రాజ్యాలు వారిని బానిసలుగా చేసుకుని భువిలో వారిని ఛిన్నాభిన్నం చేసివేసినప్పుడు బనీ ఇస్రాయీల్ ప్రవక్తలు వారికి శుభవార్తలు నివ్వడం మొదలెట్టారు. దైవం తరఫున ఒక మసీహ్ (Messiah) రానున్నాడు, అతడు వారిని ఈ హైన్యస్థితి నుండి విముక్తి కలిగిస్తాడని ధైర్యం చెప్పేవారు. ఈ భవిష్యవాణుల కారణంగా యూదులు మసీహ్ వస్తాడని ఆశించేవారు. అతను రాజయి ఉంటాడు, యుద్ధాలు చేసి విజయాలు సాధిస్తాడు; బనీ ఇస్రాయీల్‌ని దేశ దేశాల నుండి తెచ్చి పాలస్తీనాలో ఏకత్రం చేస్తాడు, వారి మహా సామ్రాజ్యాన్ని ఒకదాన్ని స్థాపిస్తాడు అని నమ్మేవారు. కాని వారి ఈ ఆశలకు భిన్నంగా మర్యమ్ కుమారుడు హజ్రత్ ఈసా (అ) దైవం పంపిన ప్రవక్తగా వచ్చినప్పుడు ఏ సైన్యమూ తీసుకురాలేదు. యూదులు ఆయన మసీహ్ తత్వాన్ని అంగీకరించ డానికి నిరాకరించారు. ఆయన్ని సంహరించడానికి సమాయత్త మయ్యారు. ఆనాటి నుండి నేటి వరకు ప్రపంచమంతటా ఉన్న యూదులు ఆ మసీహ్ మౌఊద్ (Promissed Messiah) కోసం నిరీక్షిస్తున్నారు. ఆయన రాక శుభవార్తలే వారికి ఇవ్వబడ్డాయి. వారి లిటరేచర్ అంతా ఆ రానున్న కాలపు

సుఖప్రదమయిన కలలతో నిండివుంది. తల్మూద్‌లోనూ రిబ్బీయాల సాహిత్యం లోనూ దాని రూపచిత్రణ జరిగింది. దాని కమ్మదనపు ఊహల ఆధారంగానే శతాబ్దుల తరబడి యూదులు జీవిస్తున్నారు. ఆ మసీహ్ మౌఊద్, ఒక బలమయిన యుద్ధ, రాజకీయ నాయకుడయి ఉంటాడని నైలు నది మొదలుగా ఫరాత్ నదీతీరాల వరకు ఉన్న ప్రాంతాన్ని (యూదులు దీన్ని తమ మీరాసీ దేశంగా తలుస్తారు)వారికి తిరిగి ఇప్పిస్తాడని, ప్రపంచం మూల మూలల నుండి యూదులను తెచ్చి ఆ దేశంలో తిరిగి సమావేశపరుస్తాడని ఆశిస్తున్నారు.


ఇప్పుడెవరయినా మధ్యప్రాచ్య ప్రాంతంలోని పరిస్థితుల్ని ప్రవక్త మహనీయుల (స) భవిష్యవాణుల పూర్వరంగంలో పరిశీలించి నట్లయితే వెంటనే అతనికి స్ఫురిస్తుంది- ఆ మహా దజ్జాల్ ప్రత్యక్షమవడానికి స్టేజి పూర్తిగా సిద్ధమయి ఉందని, ప్రవక్తశ్రీ (స) ఇచ్చిన వార్తల ననుసరించి యూదుల 'మసీహ్ మౌఊద్'గా రూపొంది ఆవిర్భవించగలవారు రావడానికే అంతా సిద్ధమయిందని తెలుస్తోంది. పాలస్తీనాలోని ఓ పెద్ద భూభాగం నుండి ముస్లిములు తొలగించబడ్డారు. అక్కడ ఇస్రాయీల్ పేరిట ఒక యూదు రాజ్యం నెలకొల్పబడింది. ఈ రాజ్యంలోకి ప్రపంచమంతటి నుంచి యూదులు ఆకర్షితులయి వస్తున్నారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు దాన్ని ఒక యుద్ధశక్తిగా రూపొందించాయి. యూదుల పెట్టుబడి, అంతులేని సహాయంతో యూదు శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, దాన్ని అనుదినం వృద్ధిపరుస్తూ పోతున్నారు. దాని ఈ బలిమి చుట్టు ప్రక్కలనున్న ముస్లిమ్ దేశాలకు ఒక మహా ప్రమాదంగా రూపుదాల్చింది. ఈ రాజ్యంలోని నాయకులు తమ ఆశలను దాచిపెట్టుకోలేదు. వారు తమ మీరాశీ దేశం పొందాలని కోరుకుంటున్నారు. భావిలోని యూదురాజ్య పటం వారు విచ్చలవిడిగా చాలాకాలంగా ప్రకటిస్తున్నారు. దాన్ని పటం (Map) నెం.1 లో చూడండి. దీన్ని బట్టి వారు సిరియా మొత్తం, లెబనాన్ అంతా, జోర్డాన్ అంతా, దాదాపు ఇరాక్ మొత్తంతోపాటు టర్కీ నుంచి ఇస్కెందరూన్; ఈజిప్ట్ నుండి సినాయ్


టర్కీ
సైప్రస్
మధ్యధరా సముద్రం
సిరియా
లెబనాన్
ఇరాన్
ఇరాక్
పాలస్తీన
ఇస్రాయీల్
జోర్డాన్
బస్రా
కువైత్
పర్షియన్ గల్ఫ్
ఈజిప్ట్
మదీనా
సఊదీ అరేబియా
ఎర్ర సముద్రం
N
భావి యూదురాజ్యం ఎల్లలు

పటం-1

ద్వీపకల్పం, డెల్టా ప్రాంతం, సఊదీ అరేబియా నుంచి ఉత్తర హిజాజ్, నజ్ద్ ప్రాంతం కూడా కాజేయాలని ఆశిస్తున్నారు. మదీనా పుణ్యపురి కూడా అందులో చేరి ఉంది. ఈ పరిస్థితుల్ని చూస్తే స్పష్టంగా తెలుస్తోంది- భావిలో ఏదయినా ప్రపంచయుద్ధం జరిగితే ఆ గలభాలో అదనుచూసుకుని ప్రయోజనం పొందాలని, ఈ ప్రాంతాలపైన స్వాధీనం సాధించాలని ప్రయత్నం చేస్తారు. సరిగ్గా ఆ సమయంలోనే ఆ మహాదజ్జాల్ వారి మసీహ్ మౌఊద్గా వెలుస్తాడు. ప్రవక్త మహనీయులు(స) వాడు ప్రత్యక్షమవడాన్ని గురించి తెలుపడంతోటే చాలించలేదు, ఆ కాలంలో ముస్లిములపైన కష్టాల పర్వతాలు విరుచుకుపడతాయని, అప్పుడు ఒక్కో రోజు ఒక్కో సంవత్సరంగా గడుస్తుందని అన్నారు. ఈ కారణంగానే ఆయన (స) మసీహుద్దజ్జాల్ ఉపద్రవం నుండి స్వయంగానూ దైవశరణు కోరేవారు, తన అనుచర సమాజం కూడా శరణు కోరాలని ఉపదేశించారు.

ఈ మసీహ్ దజ్జాల్ని ఎదుర్కొనేందుకు అల్లాహ్ ఎవరో మసీహ్ రూపాంకితుడిని కాదు ఆ నిజమయిన మసీహ్నే అవతరింపజేస్తాడు. ఆయన్ని రెండువేల సంవత్సరాలకు ముందు యూదులు నమ్మడానికి నిరాకరించారు, ఆయన్ని వారు తమ అభిప్రాయంలో శిలువపైకి ఎక్కించి తుదముట్టించారు కూడా. ఆ నిజమయిన మసీహ్ అవతరించే స్థలం హిందూ దేశంలోనో, ఆఫ్రికా లేక అమెరికాలోనోకాదు డెమాస్కస్లో ఉంది. ఎందుకంటే అదే సరిగ్గా ఆ సమయాన యుద్ధభూమిగా ఉంటుంది. పటం (Map) నెం.2 చూడండి. ఇస్రాయీల్ సరిహద్దు నుండి డెమాస్కస్ అతికష్టంగా 50 లేక 60 మైళ్ళ దూరాన ఉంటుంది. మేము మునుపు ఉటంకించిన హదీసులలోని విషయం మీరు గుర్తుంచుకుని చూస్తే తేలిగ్గా అర్థం చేసుకుంటారు, మసీహ్ దజ్జాల్ 70 వేల యూదుల సైన్యం తీసుకుని సిరియాలో చొరబడతాడు. డెమాస్కస్కు ఎదురుగా చేరుతాడు. సరిగ్గా ఆ సున్నితమయిన సమయాన డెమాస్కస్ తూర్పు భాగంలో ఒక తెల్లని గోపురం సమీపాన మర్యమ్ కుమారుడు హజ్రత్ ఈసా (అ) తెల్లవారుఝామున అవతరిస్తారు. ఫజ్ర్ నమాజ్



పటం-2

హజ్రత్ ఈసా (అ) పయనించిన మార్గం

తరువాత ముస్లిములను తీసుకుని వాడిని ఎదుర్కొనేందుకు బయలు దేరుతారు. ఆయన దాడికి దజ్జాల్ వెనుకంజవేస్తాడు. అఫీక్ కనుమ నుండి (హదీసు నెం. 21 చూడండి) ఇస్రాయీల్ వైపునకు మరలుతాడు. ఆయన అతడిని వెంబడిస్తారు. చివరికి 'లుద్ద్' విమానాశ్రయం చేరి వాడు ఆయన చేత సంహరింపబడతాడు (హదీసు నెం.10,14,15 చూడండి). ఆ తరువాత యూదుల్ని యేరివేసి సంహరించడం జరుగుతుంది. ప్రత్యేకంగా యూదు సముదాయం అంటూ మిగులదు. (హదీసు నెం. 9,15,21 చూడండి). క్రైస్తవం కూడా మహనీయ ఈసా (అ) పక్షాన వాస్తవికత వ్యక్తమయిన తరువాత ప్రత్యేక రూపంలో మిగులదు. (హదీసు నెం. 1,2,4,6 చూడండి). సమస్త సముదాయాలు ఒకే ముస్లిమ్ సముదాయంలో లీనమయిపోతాయి (హదీసు నెం.6,15చూడండి).

హదీసుల్లో ఎటువంటి అనుమానం లేకుండా స్పష్టంగా కానవచ్చే యదార్థం ఇది. ఆ తరువాత 'మసీహ్ మౌఊద్' పేరిట మననాట వ్యాప్తి జరుగుతున్న వ్యాపారం మహా వంచన తప్ప మరేమీ కాదని చెప్పడంలో సందేహమేముంది.